1St Happy Work Anniversary. Year

షణ్ముఖ
SHANMUKHAVELUGU
RNI : APTEL / 2023 / 89152

# వెలుగు


ప్రతి వార్త వెలుగు వైపు    తెలుగు దినపత్రిక

Good for Health
Best for Readers
THE POWER OF RK PEN

సంపుటి : 3 సంచిక : 57 ఎడిటర్ & పబ్లిషర్ : ఓబులశెట్టి రాధాకృష్ణ దాస్ శనివారం 28 ఫిబ్రవరి 2026 పేజీలు 8 : వెల 3/-ఒంగోలు,నెల్లూరు

VOLUME : 03 ISSUE : 57 EDITOR & PUBLISHER : OBULASETTY RADHAKRISHNA DASS PUBLISHED : ONGOLE,NELLORE Saturday 28 February 2026 PAGES : 8 PRICE : 3/-


# రెడ్ బుక్‌లో జగన్ పేరు ఉందో, లేదో త్వరలో తెలుస్తుంది




**గత ప్రభుత్వంలో తప్పులు చేసిన అధికారులు, నాయకులను వదిలిపెట్టేది లేదన్న లోకేశ్**

**తిరుమల లడ్డూ కల్తీపై ప్రపంచవ్యాప్తంగా ఉన్న హిందువులకు క్షమాపణ**

**చిన్నారుల సోషల్ మీడియా వాడకంపై 90 రోజుల్లో బలమైన ఫ్రేమ్‌వర్క్**

**75 ఏళ్ల వయసులోనూ చంద్రబాబు 25 ఏళ్ల యువకుడిలా పనిచేస్తారని ప్రశంస**

**(షణ్ముఖ వెలుగు, అమరావతి,ఫిబ్రవరి 27)**

ముంబయిలో ఏబీపీ నెట్‌వర్క్ ఆధ్వర్యంలో జరిగిన 'ఐడియాస్ ఆఫ్ ఇండియా - 2026' సదస్సులో ఏపీ ఐటీ, మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేష్ పలు కీలక అంశాలపై మాట్లాడారు. ఈ సందర్భంగా, గత ప్రభుత్వ హయాంలో అక్రమాలకు పాల్పడిన వారి పేర్లతో తాను నిర్వహిస్తున్న 'రెడ్ బుక్'లో మాజీ ముఖ్యమంత్రి జగన్ పేరు ఉందో లేదో త్వరలోనే తెలుస్తుందంటూ సంచలన వ్యాఖ్యలు చేశారు. గత ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వ పాలనలో తమ పార్టీ కార్యకర్తలను, నాయకులను, సాధారణ ప్రజలను అక్రమ కేసులతో తీవ్రంగా వేధించారని లోకేశ్ ఆరోపించారు. చట్టాన్ని ఉల్లంఘించిన అధికారులు, వారిని ప్రోత్సహించిన రాజకీయ నాయకులు, చిత్రహింసలకు గురిచేసిన వారి పేర్లను రెడ్ బుక్‌లో నమోదు చేస్తున్నట్లు స్పష్టం చేశారు. చట్టం నుంచి ఎవరూ తప్పించుకోలేరని, తప్పు చేసిన ప్రతి ఒక్కరూ శిక్ష అనుభవించాల్సిందేనని హెచ్చరించారు. అయితే, ఈ జాబితాలో జగన్ పేరు ఉందా లేదా అనే విషయంపై ఉత్కంఠ రేపుతూ, ఆ విషయం త్వరలోనే తెలుతుందని వ్యాఖ్యానించారు.

### 75 ఏళ్ల యువకుడు చంద్రబాబు

ఈ సందర్భంగా తన తండ్రి, ముఖ్యమంత్రి చంద్రబాబు పనితీరు గురించి లోకేశ్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. చంద్రబాబు ఒక 'టఫ్ టాస్క్‌మాస్టర్' అని, 10 కిలోలు ఎత్తగలిగితే 14 కిలోల లక్ష్యం నిర్దేశిస్తారని, అది సాధిస్తే 18 కిలోల బరువు మోయమంటారని, దీనికి అంతం ఉండదని అన్నారు. ఆయన ఇచ్చిన లక్ష్యాలను పూర్తి చేయడమే తమ పని అని తెలిపారు. 75 ఏళ్ల వయసులోనూ చంద్రబాబు 25 ఏళ్ల యువకుడిలా పనిచేస్తారని, ఆయన టేబుల్ వద్దకు తీసుకొచ్చే శక్తి అమోఘమని ప్రశంసించారు. "క్వాంటమ్ కంప్యూటింగ్ గురించి ఒక మీటింగ్‌లో చంద్రబాబు అడిగినప్పుడు, స్టాన్‌ఫోర్డ్ ఎంబీఏ చదివినా నాకు దానిపై అవగాహన లేదు. నేను టేబుల్ కింద ఫోన్‌లో చాట్‌జీపీటీలో వెతుక్కోవాల్సి వచ్చింది. ఆయన ఆలోచనలను అందుకోవడం చాలా కష్టం" అని లోకేశ్ సరదాగా వ్యాఖ్యానించారు. ▶మిగతా 2లో

# పవన్ కల్యాణ్ నాకు జీవితాంతం పెద్దన్నే!


- ▶మంత్రి నారాలోకేశ్
- ▶ముంబైలో ఏబీపీ నెట్‌వర్క్ ఆధ్వర్యంలో 'ఐడియాస్ ఆఫ్ ఇండియా - 2026' సదస్సు పాల్గొన్న ఏపీ మంత్రి నారా లోకేశ్
- ▶ఏబీపీ జర్నలిస్ట్ మేఘా ప్రసాద్‌తో జరిగిన ఫైర్ సైడ్ చాట్
- ▶ఆసక్తికర సమాధానాలు చెప్పిన నారా లోకేశ్



**(షణ్ముఖ వెలుగు, అమరావతి,ఫిబ్రవరి 27)**

అభివృద్ధి చెందిన రాష్ట్రాలే దేశాన్ని బలోపేతం చేస్తాయని, 2047 నాటికి ఆంధ్రప్రదేశ్‌ను 2.4 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ స్పష్టం చేశారు. ముంబైలో ఏబీపీ నెట్‌వర్క్ ఆధ్వర్యంలో జరిగిన 'ఐడియాస్ ఆఫ్ ఇండియా - 2026' సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏబీపీ జర్నలిస్ట్ మేఘా ప్రసాద్‌తో జరిగిన ఫైర్ సైడ్ చాట్‌లో ఆయన ఏపీ అభివృద్ధి ప్రణాళికలు, రాజకీయ అంశాలపై తన అభిప్రాయాలను పంచుకున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఒక మాట ఇస్తే అది జరిగి తీరుతుందని, ఆయన నిర్దేశించిన లక్ష్యాన్ని అధిగమించడమే తన ముందున్న కర్తవ్యమని లోకేశ్ అన్నారు. తమపై ఎలాంటి ఒత్తిడి లేదని, సవాళ్లను ఇష్టంగా స్వీకరిస్తామని తెలిపారు. కష్టకాలంలో అండగా నిలిచిన పవన్ కళ్యాణ్ తనకు బిగ్ బ్రదర్ అని, జీవితాంతం ▶మిగతా 2లో

# ఆంధ్ర విశ్వవిద్యాలయం పూర్వ వైభవాన్ని కాపాడుకోవాలి: ఎమ్మెల్యే విప్ గణబాబు



**(షణ్ముఖ వెలుగు, విశాఖపట్నం,ఫిబ్రవరి 27)**

ఆంధ్ర విశ్వవిద్యాలయానికి ఉన్న చారిత్రక ప్రాముఖ్యతతోపాటు దాని పూర్వ వైభవాన్ని కాపాడుకునేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని విశాఖ పశ్చిమ ఎమ్మెల్యే పీజీవీఆర్ నాయుడు (గణబాబు) అసెంబ్లీ వేదికగా ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. గురువారం జరిగిన శాసన సభ సమావేశాల్లో ఆయన ప్రసంగించారు. వందేళ్ల ఘన చరిత్ర కలిగిన ఏయూ ప్రాముఖ్యతను కాపాలన్నారు. ▶మిగతా 2లో

# ఏపీలో పాలు, నీళ్లు కూడా ప్రాణాంతకతమే: జగన్

- ●చంద్రబాబు ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే వరుస మరణాలని జగన్ ఆరోపణ
- ●శ్రీకాకుళం, రాజమండ్రి ఘటనలతో డజనుకు పైగా మృతి చెందారని వెల్లడి
- ●గత 14 నెలల్లో 900 మందికి పైగా విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారని ఆవేదన
- ●ప్రభుత్వం వెంటనే మేల్కొని చర్యలు చేపట్టాలని డిమాండ్


2

# బొత్స అస్వస్థతకు గురయ్యారని తెలిసి బాధపడ్డాను

## బొత్స త్వరగా కోలుకోవాలన్న పవన్ కల్యాణ్

**(షణ్ముఖ వెలుగు, అమరావతి,ఫిబ్రవరి 27)**

వైసీపీ మాజీ మంత్రి, మండలిలో విపక్ష నేత బొత్స సత్యనారాయణ హైదరాబాదులోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్టు వార్తలు రావడం తెలిసిందే. దీనిపై ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ స్పందించారు. బొత్స సత్యనారాయణ త్వరగా కోలుకోవాలంటూ ఓ ప్రకటన విడుదల చేశారు. "శాసనమండలి ప్రతిపక్ష నేత, మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ త్వరగా ఆరోగ్యవంతులు కావాలని ఆకాంక్షిస్తున్నాను. బొత్స సత్యనారాయణ అస్వస్థతకు గురయ్యారని తెలిసి బాధపడ్డాను. ఆయనకు సంపూర్ణ ఆయురారోగ్యాలు అందించాలని భగవంతుడ్ని ప్రార్థిస్తున్నాను" అని తన ప్రకటనలో పేర్కొన్నారు.

# విశాఖలో 30 ఏళ్లుగా రోడ్ల విస్తరణ లేదు.. భోగాపురం విమానాశ్రయం మొదలైతే ట్రాఫిక్ నరకం



**(షణ్ముఖ వెలుగు, విశాఖపట్నం,ఫిబ్రవరి 27)**

విశాఖపట్నంలో 30 ఏళ్లుగా రోడ్ల విస్తరణ జరగలేదని.. అప్పటికి, ఇప్పటికి జనాభా, వాహనాలు భారీగా పెరిగాయని, ఈ ఏడాది జూన్‌లో భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ఆరంభమైతే నగర ట్రాఫిక్ నరకాన్ని తలపిస్తుందని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు తెలిపారు. శాసనసభలో గురువారం ఆయన శూన్యగంటలో విశాఖలో ట్రాఫిక్ సమస్యపై మాట్లాడారు. విశాఖకు గూగుల్, ఇతర ఐటీ కంపెనీలు వస్తున్నాయని, వచ్చే నాలుగైదేళ్లలో కనీసం లక్ష మంది ఉద్యోగులు వస్తారని, వారి వాహనాలతో ట్రాఫిక్ మరింత దారుణంగా మారుతుందని తెలిపారు. ఈ సమస్యపైనా వివిధ శాఖల అధికారులతో సీఎం సమీక్షించి తగిన పరిష్కారం చూపాలని గంటా శ్రీనివాసరావు కోరారు.

# అన్ని విభాగాల ఉద్యోగులకూ పదోన్నతులు



**(షణ్ముఖ వెలుగు, అమరావతి,ఫిబ్రవరి 27)**

గ్రామ, వార్డు స్వర్ణ కార్యాలయాల్లో అన్ని విభాగాల ఉద్యోగులకు పదోన్నతులు కల్పిస్తామని రాష్ట్ర గ్రామ, వార్డు స్వర్ణశాఖ మంత్రి శ్రీబాల వీరాంజనేయస్వామి వెల్లడించారు. అర్హులైన వారందరికీ పదోన్నతులు ఇవ్వాలని సీఎం చంద్రబాబు నిర్ణయించారని ఆయన అన్నారు. గ్రామ, వార్డు కార్యాలయాల ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందేలా కూటమి ప్రభుత్వం గత 19 నెలల్లో వ్యవస్థలో అనేక మార్పులు చేసిందని మంత్రి వివరించారు. గ్రామ, వార్డు సచివాలయాల పేరును గ్రామ, వార్డు స్వర్ణ కార్యాలయాలుగా మార్పునకు సంబంధించిన సవరణ బిల్లును శాసనసభలో గురువారం మంత్రి ప్రవేశపెట్టారు. ఈ సందర్భంలోనూ, బిల్లు ఆమోదం ▶మిగతా 2లో

# ఏపీ నూతన సీఎస్‌గా సాయిప్రసాద్.. ఎంటెక్ నుంచి సీఎస్ వరకు ప్రస్థానం

**నేటితో ముగుస్తున్న విజయానంద్ పదవీ కాలం**

**కొత్త సీఎస్‌గా బాధ్యతలు స్వీకరించనున్న సాయిప్రసాద్**

**సాయిప్రసాద్ 1991 బ్యాచ్ ఐఏఎస్ అధికారి**



**(షణ్ముఖ వెలుగు, అమరావతి,ఫిబ్రవరి 27)**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నూతన ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్)గా సీనియర్ ఐఏఎస్ అధికారి జి. సాయిప్రసాద్ బాధ్యతలు చేపట్టబోతున్నారు. ప్రస్తుత చీఫ్ సెక్రటరీ కె. విజయానంద్ పదవీ కాలం రేపటితో (ఫిబ్రవరి 28) ముగియనుంది. ఈ నేపథ్యంలో, విజయానంద్ స్థానంలో సాయిప్రసాద్ ను నియమిస్తూ ప్రభుత్వం ▶మిగతా 2లో

# రెడ్ బుక్‌లో జగన్ పేరు ఉందో, లేదో త్వరలో తెలుస్తుంది

**లడ్డూ కల్తీపై క్షమాపణ.. కఠిన చర్యలు**

తిరుమల లడ్డూ ప్రసాదం అంశాన్ని లోకేశ్ తీవ్రంగా పరిగణించారు. 2019–24 మధ్య లడ్డూ తయారీలో పెద్ద ఎత్తున కల్తీ జరిగిందని, రసాయనాలు వాడారని అంగీకరించారు. జగన్ హయాంలో జరిగిన ఈ అపచారానికి, రాష్ట్ర మంత్రిగా ప్రపంచవ్యాప్తంగా ఉన్న హిందూ సమాజానికి క్షమాపణ చెబుతున్నట్లు ప్రకటించారు. లడ్డూ ప్రసాదంతో భక్తులకు ఉన్న భావోద్వేగ బంధాన్ని గుర్తుచేశారు. ఈ కల్తీకి బాధ్యులైన వారిని, సిట్ నివేదిక ప్రకారం మాజీ టీటీడీ ఛైర్మన్‌తో సహా ఎవరినీ వదిలిపెట్టబోమని హెచ్చరించారు. భవిష్యత్తులో ఇలాంటి నేరాలు చేయడానికి ఎవరైనా వెయ్యి సార్లు ఆలోచించేలా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. తిరుమలలో ప్రపంచ స్థాయి టెస్టింగ్ ల్యాబ్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు.

**సోషల్ మీడియా, జాతీయ అంశాలపై..**

చిన్నారులపై సోషల్ మీడియా ప్రభావం గురించి మాట్లాడుతూ, 11 ఏళ్లలోపు పిల్లలకు సోషల్ మీడియాను పూర్తిగా దూరంగా ఉంచాలని, 16 ఏళ్లలోపు వారికి వయసుకు తగిన కంటెంట్ మాత్రమే అందుబాటులో ఉండాలని నారా లోకేశ్ అభిప్రాయపడ్డారు. దీనిపై 90 రోజుల్లో బలమైన ఫ్రేమ్‌వర్క్‌ను తీసుకొస్తామని హామీ ఇచ్చారు. ఇక జాతీయ అంశాలపై స్పందిస్తూ, ఢిల్లీలో జరిగిన ఏఐ సదస్సులో కాంగ్రెస్ పార్టీ వ్యవహరించిన తీరు దేశ ప్రతిష్టను దెబ్బతీసేలా ఉందని విమర్శించారు. తాము ఎప్పుడూ రాష్ట్రానికి వచ్చే పెట్టుబడులను స్వాగతించామే తప్ప, గత ప్రభుత్వాల మాదిరిగా అడ్డుకోలేదని స్పష్టం చేశారు. యూఎస్ ట్రేడ్ డీల్ గందరగోళ సమయంలో సంక్షోభాన్ని అవకాశంగా మార్చుకుని ఆక్వా రైతులకు అండగా నిలిచామని, కొత్త మార్కెట్లను అన్వేషించామని తెలిపారు.

# ఏపీలో పాలు, నీళ్లు కూడా ప్రాణాంకతమే: జగన్

**(షణ్ముఖ వెలుగు, అమరావతి,ఫిబ్రవరి 27)**

ఆంధ్రప్రదేశ్‌లో ప్రజారోగ్య వ్యవస్థ పూర్తిగా కుప్పకూలిపోయిందని, చంద్రబాబు ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా తాగే నీరు, పాలు కూడా ప్రజల పాలిట ప్రాణాంతకంగా మారాయని వైసీపీ అధినేత జగన్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. రాష్ట్రంలో వరుసగా చోటుచేసుకుంటున్న డయేరియా, కల్తీ పాల మరణాలు ప్రభుత్వ వైఫల్యానికి నిలువుటద్దమని ఆయన విమర్శించారు. పరిపాలనపై పట్టుకోల్పోయిన పాలకులు, ప్రతిపక్షంపై బురద చల్లడం, కక్ష సాధింపులపైనే దృష్టి పెట్టారని, ప్రజల ప్రాణాలను గాలికొదిలేశారని జగన్ ఆరోపించారు.

గత వారంలోనే శ్రీకాకుళంలో కలుషిత నీటి కారణంగా డయేరియా ప్రబలి ఐదుగురు మరణించగా, 200 మందికి పైగా ఆసుపత్రి పాలయ్యారని జగన్ గుర్తుచేశారు. అదే వారంలో రాజమహేంద్రవరంలో కల్తీ పాలు తాగి ఏడుగురు ప్రాణాలు కోల్పోగా, మరో ఎనిమిది మంది వెంటిలేటర్లపై ప్రాణాలతో పోరాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పోషణ ఇవ్వాల్సిన పాలు, దాహం తీర్చాల్సిన నీళ్లు ప్రాణాలు తీస్తుంటే ప్రభుత్వం ఏం చేస్తోందని ఆయన ప్రశ్నించారు.టీడీపీ కూటమి ప్రభుత్వం ఏర్పడిన గత 14 నెలల్లో రాష్ట్రంలోని హాస్టళ్లు, విద్యాసంస్థల్లో సుమారు 25 ఫుడ్ పాయిజన్ ఘటనలు జరిగాయని, వీటి వల్ల 15 జిల్లాల్లో 900 మందికి పైగా విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారని జగన్ వివరించారు. కురుపాం గిరిజన బాలికల పాఠశాలలో తాజాగా 16 మంది విద్యార్థినులు డయేరియాతో అస్వస్థతకు గురయ్యారని, గతంలో ఇదే పాఠశాలలో ఇద్దరు విద్యార్థినులు మరణించినా ప్రభుత్వం పాఠాలు నేర్చుకోలేదని విమర్శించారు. రాష్ట్రంలో నెలకొన్న దారుణ పరిస్థితులను జాతీయ మీడియా సైతం ఎండగడుతోందని తెలిపారు.

గడచిన 18 నెలల్లో చేబ్రోలు, విజయవాడ, గుంటూరు, శ్రీకాకుళం వంటి అనేక ప్రాంతాల్లో డయేరియా ప్రబలి వందలాది మంది అస్వస్థతకు గురై, డజన్ల కొద్దీ మరణాలు సంభవించాయని జగన్ ఆరోపించారు. ఇది ప్రభుత్వ నిర్లక్ష్యం, పర్యవేక్షణ లోపానికి స్పష్టమైన నిదర్శనమన్నారు. ఆహార భద్రత, సురక్షిత నీటి సరఫరా వంటి కనీస

## మొదటిపేజీ తరువాయి

బాధ్యతలను కూడా ప్రభుత్వం విస్మరించిందన్నారు.

ప్రభుత్వం ఇప్పటికైనా నిద్ర మేల్కొని, రాజకీయ ప్రయోజనాలు పక్కనపెట్టి చిత్తశుద్ధితో పరిస్థితిని సమీక్షించాలని జగన్ డిమాండ్ చేశారు. లోపాలను గుర్తించి సరిదిద్దాలని, సురక్షిత నీటి సరఫరా వ్యవస్థను మెరుగుపర్చాలని, ఆహార భద్రత పర్యవేక్షణను కఠినంగా అమలు చేయాలని సూచించారు. ప్రజలు ప్రభుత్వం నుంచి అద్భుతాలు కోరుకోవడం లేదని, మరిన్ని ప్రాణాలు పోకముందే మేల్కొని, తగిన చర్యలు చేపట్టాలని మాత్రమే ఆశిస్తున్నారని జగన్ పేర్కొన్నారు.

# అన్ని విభాగాల ఉద్యోగులకూ పదోన్నతులు

పొందాక మంత్రి సభలో మాట్లాడారు. 'స్వర్ణ కార్యాలయాల్లో ఉద్యోగుల విధులు, బాధ్యతలపై గందరగోళ పరిస్థితిని తొలగించాం. జిల్లా, మండల, మున్సిపల్ స్థాయిలో పర్యవేక్షణ వ్యవస్థను తీసుకొచ్చాం. జనాభాకి తగ్గట్టుగా కార్యాలయాలను వర్గీకరించాం. స్థలాభావంతో నగరాలు, పట్టణాల్లో ఒకే డివిజన్, వార్డుల్లో రెండు, మూడు కార్యాలయాలు ఉన్నాయి. స్థలం అందుబాటులోకి వచ్చాక విభజిస్తాం. గ్రామాల్లో అవసరాల దృష్ట్యా ఉద్యాన, మత్స్య, వెటర్నరీ కార్యదర్శుల పోస్టులను రేషన్‌లైజేషన్ చేశాం' అని వివరించారు. 'ప్రజల అవసరాల మేరకు స్వర్ణ కార్యాలయాల్లో పోస్టులు భర్తీ చేయాలి. అర్హులైన ఉద్యోగులకు పదోన్నతులు కల్పించాలి' అని ఎమ్మెల్యేలు కాలవ శ్రీనివాసులు, గణబాబు అన్నారు.

**ఎమ్మెల్యే సుందరపు తీరుపై స్పీకర్ అసహనం**

వార్డు, గ్రామ సచివాలయాల పేరు మార్పునకు సంబంధించిన సవరణ బిల్లుపై చర్చ సందర్భంగా ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్ పోలవరం ప్రాజెక్టుపై మాట్లాడే ప్రయత్నం చేయడంతో స్పీకర్ అయ్యన్నపాత్రుడు అసహనం వ్యక్తం చేశారు. 'సభలో ఏ అంశం గురించి చర్చ జరుగుతోంది.. వారేం మాట్లాడుతున్నారు? విప్ గారూ (గణబాబు) ఇదేం పద్ధతి' అని స్పీకర్ వ్యాఖ్యానించారు. పోలవరం ప్రాజెక్టు గురించి మాట్లాడమని తనకు చెప్పారని విజయ్‌కుమార్ సమాధానమిచ్చారు. 'గ్రామ, వార్డు సచివాలయాల గురించి చర్చ జరుగుతున్నది కదా?' అని స్పీకర్ మరోసారి గుర్తు చేశారు. దీంతో పొరబడిన విషయాన్ని ఎమ్మెల్యే గుర్తించారు.

# పవన్ కల్యాణ్ నాకు జీవితాంతం పెద్దన్నే!

తనకు పెద్దన్నేనని ఆయన వ్యాఖ్యానించారు.

**ఒకే రాజధాని.. క్లస్టర్లతో అభివృద్ధి వికేంద్రీకరణ**

"మేము కేవలం ఒక నగరాన్ని మాత్రమే నిర్మించడం లేదు. ఒకే రాష్ట్రం, ఒకే రాజధాని, అభివృద్ధి వికేంద్రీకరణ అనే నినాదాన్ని బలంగా నమ్ముతాం. విశాఖపట్నం, అమరావతి, తిరుపతిలను ఆర్థిక రీజియన్లుగా అభివృద్ధి చేస్తూ, వాటి పరిధిలో పారిశ్రామిక క్లస్టర్లను ఏర్పాటు చేస్తున్నాం," అని లోకేశ్ వివరించారు. క్లస్టర్ విధానాన్ని వివరిస్తూ, "ఉదాహరణకు ఎలక్ట్రానిక్స్ తయారీ రంగంలో ఫాక్స్‌కాన్ లాంటి ఒక కంపెనీని తీసుకురావడమే కాకుండా, ఐఫోన్ అసెంబుల్‌కు అవసరమైన అన్ని విడిభాగాల తయారీదారులను ఒకేచోటకు తీసుకురావడమే మా వ్యూహం. దీని ద్వారా అభివృద్ధిని రాష్ట్రవ్యాప్తంగా వికేంద్రీకరించడం సుసాధ్యమవుతుంది" అని తెలిపారు.

**'నమో' సర్కార్‌తో పెట్టుబడుల వెల్లువ**

ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడులు పెట్టేందుకు మూడు ప్రధాన కారణాలు ఉన్నాయని లోకేష్ పేర్కొన్నారు. "ఒకటి, అద్భుతమైన ట్రాక్ రికార్డు ఉన్న అనుభవజ్ఞుడైన ముఖ్యమంత్రి చంద్రబాబు... రెండవది, స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్. కేవలం 17 నెలల్లోనే దేశంలోనే అతిపెద్దదైన ఆర్సెలర్ మిట్టల్ స్టీల్ ప్లాంట్‌కు అన్ని అనుమతులు ఇచ్చాం. మార్చి మూడోవారంలో దానికి శంకుస్థాపన చేయబోతున్నాం. మూడవది, డబుల్ ఇంజన్ బుల్లెట్ ట్రైన్ సర్కార్. ఢిల్లీలో ప్రధాని మోదీ, ఏపీలో సీఎం నాయుడు కలయికను నేను 'నమో' (నాయుడు–మోదీ) అని పిలుస్తాను. ఈ నాయకత్వం వల్లే భారతదేశానికి వచ్చిన మొత్తం పెట్టుబడుల్లో 25.3 శాతం ఏపీకి వచ్చాయి" అని ఆయన గణాంకాలతో వివరించారు.

**భూమి కన్నా ఎకోసిస్టమ్ విలువైంది**

ఫార్చ్యూన్ 500 కంపెనీలను ఆకర్షించేందుకు ఎకరా భూమిని 99 పైసలకే ఇస్తున్నామని, తాము ఇచ్చే భూమి విలువ కన్నా ఆ కంపెనీల రాకతో ఏర్పడే ఆర్థిక కార్యకలాపాలు, ఉద్యోగ కల్పన ఎన్నో రెట్లు అధికమని లోకేశ్ తెలిపారు. కాగ్నిజెంట్ కంపెనీని ఉదాహరణగా చూపుతూ, "విశాఖలో ఆ కంపెనీ ఏర్పాటుతో 25,000 ఉద్యోగాలు వస్తాయి. ఏటా రూ.1500 కోట్ల ఆర్థిక కార్యకలాపాలు జరుగుతాయి. భూమి విలువ కన్నా రాష్ట్రానికి వచ్చే ఈ ప్రయోజనం ఎంతో పెద్దది" అని స్పష్టం చేశారు.

**అమరావతే భవిష్యత్తు.. దేశానికి గర్వకారణం**

అమరావతి నిర్మాణం శరవేగంగా సాగుతోందని, ఇది భవిష్యత్తుకు చిరునామా అని లోకేశ్ అన్నారు. "పారిశ్రామికవేత్తలు ఇప్పుడు ఏపీకి రాకపోతే, భవిష్యత్తులో ఎందుకు రాలేకపోయామని బాధపడతారు. ప్రతి వంద రోజులకు ఒకసారి అమరావతికి వచ్చి చూడండి. అక్కడ పనులు ఎంత వేగంగా జరుగుతున్నాయో మీకే తెలుస్తుంది. భారతదేశం గర్వించేలా రాజధానిని నిర్మిస్తున్నాం" అని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమష్టి కృషితో విశాఖ స్టీల్ ప్లాంట్‌ను కాపాడామని, ప్రస్తుతం అది లాభాల బాటలో పయనిస్తోందని తెలిపారు. తాము సమిష్టి సమాఖ్య స్ఫూర్తిని విశ్వసిస్తామని, డేటా సెంటర్ పాలసీ రూపకల్పనలో కేంద్రంతో కలిసి పనిచేసి దేశవ్యాప్తంగా ప్రయోజనం చేకూర్చే ఫ్రేమ్‌వర్క్‌ను రూపొందించామని లోకేశ్ పేర్కొన్నారు.

# ఆంధ్ర విశ్వవిద్యాలయం పూర్వ వైభవాన్ని కాపాడుకోవాలి: ఎమ్మెల్యే విప్ గణబాబు

సి.వి. రామన్, సర్వేపల్లి రాధాకృష్ణన్ వంటి మహానుభావుల వారసత్వాన్ని స్ఫూర్తిగా తీసుకుని, యూనివర్సిటీని ప్రపంచ స్థాయికి తీసుకెళ్లాలని కోరారు. గత వైకాపా ప్రభుత్వ పాలనలో యూనివర్శిటీ రాజకీయ అడ్డాగా మారిందని, దీనివల్ల విద్యాసంస్థ ప్రతిష్ఠ దెబ్బతిన్నదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.యూనివర్శిటీలో రాజకీయ జోక్యం లేకుండా చేసి, విద్యా ప్రమాణాలను పునరుద్ధరించాలన్నారు. గత 18 ఏళ్లుగా కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్లుగా పనిచేస్తున్న 93 మందిని వెంటనే రెగ్యులరైజ్ చేయాలని కోరారు. వీరిలో చాలామంది పదవీ విరమణకు దగ్గరగా ఉన్నందున, వారి భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని తక్షణ చర్యలు తీసుకోవాలన్నారు.సుమారు 400 నుంచి 500 మంది గెస్ట్ ఫ్యాకల్టీ కేవలం రూ.15 వేలకే పనిచేస్తున్నారని తెలిపారు. వారి ఆర్థిక ఇబ్బందులను గమనించి, సానుకూల నిర్ణయం తీసుకోవాలని విన్నవించారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ప్రత్యేక చొరవ తీసుకుని, ఏయూ శతాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని కోరారు. యూనివర్శిటీ అభివృద్ధికి, సిబ్బంది సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

# ఏపీ నూతన సీఎస్‌గా సాయిప్రసాద్.. ఎంటెక్ నుంచి సీఎస్ వరకు ప్రస్థానం

ఇప్పటికే అధికారికంగా ఉత్తర్వులు జారీ చేసింది. రేపు ఉదయం సచివాలయంలో కొత్త సీఎస్‌గా సాయిప్రసాద్ బాధ్యతలను స్వీకరిస్తారు.

1991 బ్యాచ్ ఏపీ క్యాడర్‌కు చెందిన ఐఏఎస్ అధికారి జి. సాయిప్రసాద్ 'ఎంటెక్' చదివారు. సివిల్ సర్వీసులోకి ప్రవేశించి 1992లో వరంగల్ అసిస్టెంట్ కలెక్టర్‌గా తన వృత్తి జీవితాన్ని ప్రారంభించారు. 1993–95 మధ్య పాడేరు అసిస్టెంట్ కలెక్టర్‌గా గిరిజన ప్రాంతాల్లో సేవలందించారు. 1995 నుంచి 1997 వరకు గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌గా... 1997–98 మధ్య కాలంలో కడప జాయింట్ కలెక్టర్‌గా పనిచేశారు. 2000 నుంచి 2003 వరకు కర్నూలు జిల్లా కలెక్టర్‌గా పనిచేశారు.సాయి ప్రసాద్ విద్యుత్ రంగం, గృహనిర్మాణ రంగాల్లో కూడా కీలక బాధ్యతలు నిర్వహించారు. ఏపీ ట్రాన్స్‌కో జాయింట్ ఎండీ, ఈపీడీసీఎల్ సీఎండీ, ఏపీ సీపీడీసీఎల్ సీఎండీ, ఏపీ హౌసింగ్ బోర్డు వైస్ చైర్మన్‌గా సేవలందించారు. 2011 నుంచి 2014 వరకు కేంద్ర ప్రభుత్వ ఇంధన శాఖలో సంయుక్త కార్యదర్శిగా కూడా పనిచేశారు. సాయిప్రసాద్ 2014 నుంచి 2019 వరకు ముఖ్యమంత్రి కార్యాలయంలో కార్యదర్శిగా, ముఖ్య కార్యదర్శిగా పనిచేశారు. ఆ తర్వాత సోలార్ పవర్ కార్పొరేషన్ సీఎండీగా, ఇంధన శాఖ ప్రధాన కార్యదర్శిగా పనిచేశారు. 2024 నుంచి జలవనరుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా కొనసాగుతూ ఇప్పుడు రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించబోతున్నారు.

# గోదావరి పుష్కరాల పనులన్నీ ఇప్పట్నుంచే ఆరంభించాలి

**– సాధారణ ధరలకే టెంట్‌సిటీలు, హోమ్ స్టేలలో వసతి లభించాలి**

**– జూన్‌లో పుష్కరాల కర్టెన్‌రైజర్ కార్యక్రమం – మంత్రివర్గ ఉపసంఘం సమావేశంలో మంత్రులు**



**(షణ్ముఖ వెలుగు, అమరావతి,ఫిబ్రవరి 27)**

గోదావరి పుష్కరాలపై మంత్రి వర్గ ఉపసంఘం భేటీలో మాట్లాడుతున్న మంత్రి ఆనం రామనారాయణరెడ్డి. చిత్రంలో నిమ్మల రామానాయుడు, గొట్టిపాటి రవికుమార్, బీసీ జనార్ధన్‌రెడ్డి, కందుల దుర్గేష్, మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, నారాయణ వచ్చే ఏడాది జరగనున్న గోదావరి పుష్కరాల పనులన్నీ ఇప్పట్నుంచే ఆరంభించాలని, దీనికోసం శాఖల వారీగా ప్రతిపాదనలు సిద్ధం చేయాలని మంత్రులు పేర్కొన్నారు. ముందస్తు ఏర్పాట్ల కోసం బడ్జెట్‌లో రూ.60 కోట్లు కేటాయించినట్లు వెల్లడించారు. గోదావరి పుష్కరాలపై ఏర్పాటైన మంత్రివర్గ ఉపసంఘం గురువారం సచివాలయంలో భేటీ అయింది. దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో మంత్రులు నారాయణ, నిమ్మల రామానాయుడు, కందుల దుర్గేష్, బీసీ జనార్ధన్‌రెడ్డి, సత్యకుమార్ యాదవ్, గొట్టిపాటి రవికుమార్, మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు. పలు అంశాలపై చర్చించి, నిర్ణయాలు తీసుకున్నారు.

**రెండుచోట్ల టెంట్ సిటీలు**

- రాజమహేంద్రవరం సమీపంలోని బ్రిడ్జిలంక, పిచ్చుకలంకల్లో టెంట్ సిటీలు
- సాధారణ ధరలకే టెంట్ సిటీలు, హోమ్ స్టేల్లో వసతి
- పుష్కరాలు జరిగే ప్రాంతాల్లో ప్రస్తుతం 4,800 గదులున్నాయి. ఇంకా వసతి కోసం ఖాళీ ప్రదేశాలు, మైదానాలు, ఫంక్షన్ హాళ్లు పరిశీలించాలి.
- గతంలో 234 ఘాట్లు ఉండగా, ఈ సంఖ్యను 373 ఘాట్లకు పెంచాలి. 70 పిండప్రదాన ఘాట్ల ఏర్పాటు.
- 10కోట్ల మంది వస్తారని అంచనా. తొలిరోజు, వారాంతం, అమావాస్య రోజుల్లో.. సగటున కోటి మంది చొప్పున వస్తారు.
- ఏ ఘాట్‌లో స్నానం చేసినా, ఒకేలా పుణ్యఫలం వస్తుందంటూ.. ప్రభుత్వ సలహాదారు చాగంటి కోటేశ్వరరావుతో ప్రజల్లో అవగాహన కల్పిస్తే బాగుంటుంది.
- రద్దీ నియంత్రణకు ఏఐ టెక్నాలజీ వినియోగించాలి. ఆర్టీజీఎస్‌తో సమన్వయం చేసుకోవాలి.

**రాజమహేంద్రవరంలో కర్టెన్‌రైజర్**

- పుష్కరాలకు ఏడాది ముందుగా ఈ జూన్‌లో కర్టెన్‌రైజర్ కార్యక్రమాన్ని రాజమహేంద్రవరంలో భారీగా నిర్వహించాలి.
- 3వేల కి.మీ. మేర రహదారుల పునరుద్ధరణ, విస్తరణ పనులు ఇప్పుడే ఆరంభించాలి.
- కొత్త ఘాట్ల నిర్మాణం, పాతవాటికి మరమ్మతులు చేపట్టి, నాణ్యతకు పెద్దపీట వేయాలి.


ఆరు జిల్లాల సంయుక్త కలెక్టర్లు నోడల్ అధికారులుగా అన్ని శాఖలతో సమన్వయం చేసుకొని పనిచేయాలి.నీ గోదావరి సమీపంలో ఉండే 391 ఆలయాల్లో మరమ్మతులు, 43 ఆలయాల్లో పునర్నిర్మాణ పనులు చేపట్టాలి. నీ ఈ సమావేశంలో వివిధ శాఖల ఉన్నతాధికారులతో పాటు, ఆరు జిల్లాల కలెక్టర్లు వర్చువల్‌గా పాల్గొన్నారు.

# పారిశ్రామికవేత్తలకు 20 నెలల్లో.. రూ.2 వేల కోట్ల ప్రోత్సాహకాలు ఇచ్చాం



**(షణ్ముఖ వెలుగు, అమరావతి,ఫిబ్రవరి 27)**

వైకాపా ప్రభుత్వం ఐదేళ్లలో పారిశ్రామికవేత్తలకు రూ.2 వేల కోట్ల ప్రోత్సాహకాలిస్తే, కూటమి ప్రభుత్వం 20 నెలల్లోనే రూ.2 వేల కోట్లకు పైగా ప్రోత్సాహకాలు విడుదల చేసినట్లు పరిశ్రమలశాఖ మంత్రి టీజీ భరత్ తెలిపారు. ఇందులో ఎస్సీ, ఎస్టీ పారిశ్రామికవేత్తలకు రూ.270 కోట్లు ఇచ్చామన్నారు. శాసనసభలో గురువారం ప్రశ్నోత్తరాల్లో ఎస్సీ, ఎస్టీ పారిశ్రామికవేత్తలకు అవకాశాలపై ఎమ్మెల్యేలు అయితాబత్తుల ఆనందరావు, విజయ్‌చంద్ర, కొండ్రు మురళీమోహన్ అడిగిన ప్రశ్నలకు మంత్రి బదులిచ్చారు. 'రాయితీల విషయంలో ఎస్క్రో ఎకౌంట్ మెకానిజం తెచ్చి, దానికి చట్టం చేయాలని యోచిస్తున్నాం. ఎవరి జోక్యమూ లేకుండా నేరుగా పారిశ్రామికవేత్తల ఖాతాల్లోనే ప్రోత్సాహకాలు జమయ్యేలా చూస్తున్నాం. టెండర్లలో ఎస్సీ, ఎస్టీలకు 4 శాతం రిజర్వేషన్ వర్తింపజేస్తున్నాం. కేంద్ర పథకాలన్నీ వాడుకునేలా రూ.100 కోట్ల కార్పస్ ఫండ్ ఏర్పాటు చేయబోతున్నాం. దీనివల్ల 5 వేల ఎంఎస్ఎంఈలకు ప్రయోజనం కలగనుంద'ని మంత్రి తెలిపారు. అంతకుముందు ఎమ్మెల్యేలు మాట్లాడుతూ ఎంఎస్ఎంఈ పార్కుల్లోని భూములకు గరిష్ఠంగా రూ.25 లక్షల వరకే రాయితీ ఉందని, దాన్ని రూ.50 లక్షలకు పెంచాలని కోరారు.


ప్రకాశం

మార్కాపురం

బాపట్ల

షణ్ముఖ
# వెలుగు
ప్రతి వార్త వెలుగు వైపు | తెలుగు దినపత్రిక
28.02.26 శనివారం


## శాసనసభను సందర్శించిన విద్యార్థులు



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఫిబ్రవరి 27)
అమరావతి నందు డీజేఆర్ ట్రస్టు ఆధ్వర్యంలో ఒంగోలు నియోజకవర్గంలోని ఉచితంగా చదివిస్తున్న 100 మంది విద్యార్థులును శాసనసభను సందర్శించారు. బాలల శాసనసభ యాత్ర పేరుతొ అసెంబ్లీ సమావేశాలు ఎలా నిర్వహిస్తారో, సంక్షేమ పథకాలు, ప్రజా సమస్యలు ఎలా చర్చిస్తారో అని విద్యార్థులకు విజ్ఞాన యాత్రలో భాగంగా

## వైవి సుబ్బారెడ్డిని అరెస్టు చేయాలి

మాజీ మంత్రి, జనసేన రాష్ట్ర నాయకులు బాలినేని



## రాజకీయం శాశ్వతం కాదు..
# అభివృద్ధే లక్ష్యం...!

వెలుగొండ ప్రాజెక్టు శంకుస్థాపన చేసింది చంద్రబాబే
ప్రాజెక్టు మొత్తం అతనే చేశాడు అనేది అబద్దం
జులై నాటికి ప్రాజెక్టు పూర్తి చేసే నీరిస్తే ఈ ప్రాంతమంతా రుణపడి ఉంటారు
మార్కాపురం జిల్లాను స్వాగతిస్తున్నాం
2014 నుంచి 19 సంవత్సర కాలంలో మాయమాటలు చెప్పలేదా
విలేకరుల సమావేశంలో మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు

(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, మార్కాపురం, ఫిబ్రవరి 27)
రాజకీయాలు శాశ్వతం కాదు మా ప్రాంతం అభివృద్ధే లక్ష్యం అని మాజీ ఎమ్మెల్యే, మార్కాపురం వైసిఆర్సిపి ఇన్‌ఛార్జి అన్నా వెంకట రాంబాబు అన్నారు. శుక్రవారం మార్కాపురం వైసీపీ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ నెల 25వ తేదీన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు మార్కాపురం పర్యటనకు వచ్చి వైసిపి నాయకుడి పై బురద జల్లటం మంచి పద్ధతి కాదని అన్నారు. జులై 2026 నాటికి వెలిగొండ ప్రాజెక్టు పూర్తి చేస్తామని సీఎం చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని అన్నారు. మీరు చెప్పిన విధంగా వెలుగొండ ప్రాజెక్టు పూర్తి చేయండి. ఈ ప్రాంత ప్రజానీకమంతా రాజకీయంగా మీ వెంట ఉంటామని పేర్కొన్నారు. రాజకీయం శాశ్వతం కాదు.. మా ప్రాంతం అభివృద్ధి చెంది వెనుకబాటుతనం పోవాలన్నదే మా లక్ష్యమని తెలిపారు. రూ.9 వేల కోట్లతో నిర్మిస్తున్న వెలుగొండ ప్రాజెక్టుకు 13 సంవత్సరాలు సీఎంగా ఉన్న చంద్రబాబు ఖర్చు పెట్టింది కేవలం రూ. 1,100 కోట్లు మాత్రమేనని చెప్పుకొచ్చారు. నాటి కాంగ్రెస్ పాలనలో వైఎస్సార్, వైసీపీ పాలనలో కూడా జగన్ ఖర్చు పెట్టారన్నారు. అంతా తానే చేసినట్లు చంద్రబాబు చెప్పుకోవడం బాధాకరమన్నారు. 1996 మార్చి 5వ తేదీన శంకుస్థాపన వేసింది వాస్తవమే కానీ ఆ తరువాత ఎనిమిది సంవత్సరాలు ముఖ్యమంత్రిగా ఉండి పులసుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టు ఒక్క కట్ట మట్టి గాని, నీళ్లు గాని, ఒక రూపాయి కూడా ఖర్చు చేసింది ఏమీ లేదన్నారు. 2004 సంవత్సరంలో ముఖ్యమంత్రి దివంగత నేత వైయస్ రాజశేఖర్‌రెడ్డి పులసుబ్బయ్య వెలుగొండ ప్రాజెక్టుకు దాదాపు 70 శాతం పనులు




పూర్తి చేశారన్నారు. అనంతరం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విడిపోయిన తర్వాత ముఖ్యమంత్రిగా చంద్రబాబునాయుడు వెలిగొండ ప్రాజెక్టుకు ఒక టన్నెల్ కూడా పూర్తి చేయకుండా ఈవిగో నీరు అవిగో నీరు ఉగాదికి పూర్తి అవుతుంది, సంక్రాంతికి, దసరాకు పూర్తి చేస్తాం అంటూ కాలం, పబ్బం గడిపాడు తప్ప ఒక్క సొరంగం కూడా పూర్తి చేయలేదన్నారు. గత ఐదు సంవత్సరాలు తమ నాయకుడు, మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి అబద్ధపు మాటలు చెప్పి మోసం చేస్తే, 2014 నుంచి 19 సంవత్సరంలో మీరు, మీ నాయకులు మోసం చేయలేదా అన్నారు. మార్కాపురం జిల్లా చేయటం చాలా సంతోషకరం, అలాగే ఈ సంవత్సరం జులై నాటికి వెలిగొండ ప్రాజెక్టు కెనాల్‌ను పూర్తిచేసి నీరు అందించాలని డిమాండ్ చేశారు. ఈ ప్రాంత అభివృద్ధికి సహకరించి అభివృద్ధి బాటలో నడిపిస్తారని, లేని పక్షాన మీ తప్పుడు మాటలు ఎండ కడతామని అన్నారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ కార్పొరేషన్ మాజీ చైర్మన్, ఏ వన్ గ్లోబల్ అధినేత షంషీర్ అలీ బే, జడ్పిటిసి బాపన్‌రెడ్డి, మండల కన్వీనర్ చెంచిరెడ్డి, కౌన్సిలర్లు, వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఈసీ బెల్లంకొండ కిషోర్ సస్పెండ్



(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, మార్కాపురం, ఫిబ్రవరి 27)
ఉపాధి హామీ పథకంలో ఈసిగా విధులు నిర్వర్తిస్తున్న బెల్లంకొండ కిషోర్‌ను సస్పెండ్ చేస్తూ ఆ శాఖ పి డి జోసెఫ్ కుమార్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. వివరాల్లోకి వెళితే అర్ధవీడు మండలంలో విధులు నిర్వహించిన సమయంలో లేని మొక్కలను ఉన్నవిగా చూపిస్తూ లక్షల రూపాయల అవినీతికి పాల్పడ్డాడని ఫిర్యాదులు అందాయి. ఆ ఫిర్యాదుల మేరకు జిల్లా కలెక్టర్ ఆదేశాలతో పిడి జోసెఫ్ కుమార్ పూర్తి స్థాయి విచారణ చేపట్టి ఆరోపణలు రుజువు కావడంతో ఆయనను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

# వేటపాలెం ఎస్ఐ దౌర్జన్యకాండ

చేనేత కుటుంబం పై పోలీసుల వేధింపులు
వృద్ధులపై ఎస్ఐ దాడి, దూషణ, బెదిరింపులు
సోషల్ మీడియాలో వీడియో వైరల్
రెండు వారాలుగా అజ్ఞాతంలోఉన్న బాధితులు
జాతీయ మానవ హక్కుల కమిషన్‌లో ఫిర్యాదు

(షణ్ముఖ వెలుగు, బాపట్ల, ఫిబ్రవరి 27)
రెండు కుటుంబాల మధ్య నెలకొన్న వివాదాన్ని పరిష్కరించాల్సిన పోలీసు అధికారి ఓ వృద్ధుడి పై చేయి చేసుకోవడం, అసభ్యకరంగా దూషించటం, అధికార దుర్వినియోగానికి పాల్పడడం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. ప్రస్తుతం ఒక చేనేత కార్మికుడి పై ఒక పోలీస్ అధికారి దౌర్జన్యం చేసిన సీసీటీవీ ఫుటేజీ వీడియో సోషల్ మీడియాలో వైరల్ గా మారింది. ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఈ సంఘటన ఈ నెల 11వ తేదీన బాపట్ల జిల్లా వేటపాలెం మండలం రామన్నపేట పంచాయితీ పరిధిలోని బాపయ్యనగర్‌లో చోటు చేసుకున్నట్లు తెలిసింది. ఈ ఘటనలో సీసీ ఫుటేజ్ నందు నమోదైన దృశ్యాలు పోలీసు వ్యవస్థ తలదించుకునేలా ఉన్నాయి. బెదిరింపులకు భయపడి అజ్ఞాతంలోకి వెళ్లిన ఆ దంపతులు బంధువుల సహకారంతో గురువారం జాతీయ మానవ హక్కుల కమీషన్‌కు ఫిర్యాదు చేశారు.



## ఎమ్మెల్యే దామచర్లపై మండిపడ్డ బాలినేని



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఫిబ్రవరి 27)
ఒంగోలులో జరుగుతున్న భూకబ్జాల పై విచారణ చేపట్టాలని జనసేన పార్టీ రాష్ట్ర నాయకులు, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసులురెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం ఒంగోలులో ఆయన మీడియాతో మాట్లాడారు. ఒంగోలు ఎమ్మెల్యే దామచర్లను ఆరోపిస్తూ ఆయన పలు విమర్శలు చేశారు. డ్వాక్రా గ్రూపుల్లో 100 కోట్లు అవినీతి జరిగిందని, దాంట్లో తన కుమారుడికి సంబంధం ఉందని తప్పుడు ఆరోపణలు పత్రికల్లో రాయించారన్నారు. డ్వాక్రా సంఘాల్లో గత ప్రభుత్వంతో పాటు ప్రస్తుత ప్రభుత్వంలో జరిగిన అవినీతి అక్రమాల పై విచారణ చేపట్టి అక్రమార్కుల పేర్లు బయట పెట్టాలని డిమాండ్ చేశారు. బ్రాహ్మణ స్థలాలు మేము కబ్జా చేశామని ఆరోపణ చేసిన వ్యక్తే ఇప్పుడు ఒంగోలులో భూ కబ్జాలు

వెలుగు
ePaper
www.shanmukhavelugu.com
4 | 28.02.26
శనివారం

# శాసనసభను సందర్శించిన విద్యార్థులు

విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ కార్యక్రమన్ని చేపట్టడం జరిగింది. ఈ సందర్భంగా అసెంబ్లీ అవరణలో ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్‌రావు, ట్రస్ట్ సభ్యులకు విద్యార్థిని, విద్యార్థులు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సాంఘిక, సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి, విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి, గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తముల అశోక్‌రెడ్డి, ట్రస్ట్ నిర్వాహకులు దామచర్ల నాగ సత్యలత, దామచర్ల అనిషా లక్ష్మి, ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.


# వైవి సుబ్బారెడ్డిని అరెస్టు చేయాలి


(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, ఒంగోలు, ఫిబ్రవరి 27)
టిటిడి మాజీ చైర్మన్, రాజ్యసభ సభ్యులు వైవీ సుబ్బారెడ్డి పై ఆయన బావమరిది, మాజీ మంత్రి, జనసేన పార్టీ రాష్ట్ర నాయకులు బాలినేని శ్రీనివాసులురెడ్డి విమర్శలు చేశారు. జనసేన సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఒంగోలులో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న ఆయన అనంతరం మీడియాతో మాట్లాడారు. టిటిడి చైర్మన్ సుబ్బారెడ్డి ఎంత సంపాదించారో తెలియదు గాని అంతకుమించి దోచుకున్నారని తీవ్రస్థాయిలో ఆరోపించారు. వైవి సుబ్బారెడ్డిని అరెస్టు చేస్తే మొదటిగా సంతోషపడేది తానే అని అన్నారు. ఇటీవల తాను ఒంగోలు వచ్చిన సందర్భంలో తిరుమల లడ్డూ పై మాట్లాడిన మాటలను వక్రీకరిస్తూ వైవీ సుబ్బారెడ్డి కి అనుకూలంగా మాట్లాడనని ప్రచారం చేశారని, దానిని తాను తీవ్రంగా ఖండిస్తున్నాను అని చెప్పారు. సొంత కుటుంబ సభ్యుల పైన బాలినేని చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం రాజకీయంగా తీవ్ర చర్చనీయాంశంగా మారాయి.

# ఎమ్మెల్యే దామచర్లపై మండిపడ్డ బాలినేని

చేస్తున్నారని విమర్శించారు. ప్రభుత్వం ఉచితంగా ఇస్తున్న ఇసుకను కూడా దోచుకుంటున్నారని మండిపడ్డారు. గత వైసిపి ప్రభుత్వంలో జరిగిన భూకబ్జాల పై తాను సిట్ వేపిస్తే ప్రస్తుత ఎమ్మెల్యే ఇప్పుడు వాళ్ళతో చర్చలు జరిపి భూ దందాలు చేస్తున్నారన్నారు. ఇంట్లో వ్యక్తి లెటర్ రాసి అందరికీ పెడితే హైదరాబాదులో ఉండి నేను రాయించానని ఆరోపించారు. ఒంగోలులో జరుగుతున్న అవినీతి దందాలు, భూ అక్రమాల పై ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కు ఫిర్యాదు చేస్తానని బాలినేని స్పష్టం చేశారు. జిల్లాలో భూ అక్రమాలు జరగకుండా నిలబడతానన్నారు.

# వేటపాలెం ఎస్ఐ దౌర్జన్యకాండ చేనేత కుటుంబం పై పోలీసుల వేధింపులు






వివరాల్లోకి వెళితే రెండు కుటుంబాల మధ్య కసువు చిమ్మి పోసే విషయమై గత నాలుగు నెలల క్రితం ఏర్పడిన చిన్న వివాదం విషయంలో స్థానిక అధికార పార్టీ నేతలు జొరబడి, తమ ఆధిపత్యాన్ని ప్రదర్శించడంతో సమస్య జటిలంగా మారింది. కుటుంబాల సమస్యను పంచాయతీ గల్లి సమస్యగా మార్చిన స్థానిక నాయకులు వేటపాలెం ఎస్ఐ పి జనార్దన్ తన సిబ్బందితో ఆ ప్రాంతానికి వెళ్లినట్లు స్థానికులు చెబుతున్నారు. అయితే అక్కడ జరిగిన వాగ్వివాదం మధ్యలో ఎస్ఐ జనార్ధన్‌ను ప్రోత్సహించడంతో ఫిబ్రవరి 11వ తేదీ రాత్రి పింజల వీర నాగేశ్వరరావు ఇంటికి తన సిబ్బందితో వెళ్లిన ఎస్ఐ వృద్ధుడు పై చేయి చేసుకోవడంతో పాటు తీవ్ర పరుష పదజాలంతో దుర్భాషలాడటం సీసీ పుటేజిలో నమోదైంది. అంతటితో ఆగకుండా మహిళ పట్ల దురుసుగా వ్యవహరించడం, భార్యాభర్తలను పోలీస్ స్టేషన్ కు పోలీసు వాహనంలో తరలించడం సంఘటన స్థలంలోని సీసీ పుటేజ్ నందు నమోదయ్యాయి. సమస్యకు రాజకీయ రంగు పులుముకోవడంతో ఎస్ఐ అధికార పార్టీ నేతలకు అనుకూలంగా వ్యవహరించారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. పోలీసుల బెదిరింపులకు భయపడి అజ్ఞాతంలోకి వెళ్లిపోయిన ఆ బాధిత కుటుంబం గురువారం జాతీయ మానవ హక్కుల కమిషన్‌ను ఆశ్రయించింది. అదే సమయంలో రాష్ట్ర ప్రభుత్వం పెద్దలకు, అధికారులకు ఫిర్యాదులు చేశారు. ఈ ఘటనలో వీడియోలు బహిర్గతం కాకూడదని ఎస్ఐ జనార్ధన్ హెచ్చరించడం పై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

**ఫిర్యాదులో ఏముందంటే...** ఇంటి ప్రక్కన నివాసం ఉంటున్న దోగుపర్తి హేరంబరరావు భార్య భువనేశ్వరి ఇంటి కసువు చిమ్మే విషయమై జరిగిన చిన్న వివాదాన్ని స్థానిక అధికార పార్టీ నాయకులు వేటపాలెం ఎస్ఐ పి జనార్ధన్ సహకారంతో దోగుపర్తి హేరంబరావు భార్య చేత పింజల వీర నాగేశ్వరరావు, యోగానంద్, వెంకట్, వినయ్‌లు వేధింపులకు గురి చేస్తున్నట్లు తప్పుడు ఫిర్యాదు తీసుకున్న పోలీసులు మమ్మల్ని పదేపదే వేధిస్తున్నారని, కేసు నమోదు చేయకుండా ఉండాలంటే రూ.20 వేలు ఇవ్వాలని డిమాండ్ చేయడంతో కేసుల భయంతో జనవరి 6వ తేదిన వేటపాలెం ఎస్ఐ పి జనార్ధన్ చెప్పిన పాముల సత్య మోహన్‌కు ఫోన్ పే ద్వారా రూ.20 వేలు పంపినట్లుగా ఆధారాలతో ఫిర్యాదు చేశారు. వేటపాలెం ఎస్ఐ బాధితులను బెదిరించి పోలీసుల సమక్షంలో ఇంటి మెట్లు బాధితుల చేతనే పగుల కొట్టించారని పేర్కొన్నారు. ఫిబ్రవరి 11వ తేదీ రాత్రి సుమారు 7.30 గంటలకు వేటపాలెం ఎస్ఐ పి జనార్ధన్ మరి కొంతమంది పోలీస్‌లు వచ్చి తనను, తన భర్తను అసభ్యకరంగా దూషిస్తూ తన భర్త మీద చేయి చేసుకోవడమే కాకుండా, మద్యం తాగావని నిందలువేస్తూ, తనను, తన భర్తను పోలీస్ వాహనంలో వేటపాలెం పోలీస్ స్టేషన్ కి తీసుకెళ్లి నిర్భందంగా తెల్ల కాగితాలపై తన భర్త సంతకం తీసుకున్నారని, పోలీసుల బెదిరింపులతో భయపడి ఇల్లు వదిలి వెళ్లిపోయిన దంపతులు రెండు వారాలుగా బంధువుల ఇళ్లలో తలదాచుకున్నట్లు తెలిపారు. ఈ మొత్తం వ్యవహారంలో స్థానిక అధికార పార్టీ నాయకులు దోగుపర్తి హేరంబరరావు, అతని భార్య భువనేశ్వరి, దోగుపర్తి భీమయ్య, దోగుపర్తి లీలా, దోగుపర్తి రాజేష్, గడ్డం ప్రసాద్, వుమ్మిటి శంకరరావు, కల్లూరి నాగరాజు, గొల్లప్రోలు కృష్ణ, నాసిక వీరబ్రద్రయ్య, సిద్ధి బుచ్చేశ్వరరావులు పోలీస్‌ల సహకారంతో వేధింపులకు గురిచేస్తూ, చంపుతామని బెదిరిస్తున్నారని, తన భర్త మతి భ్రమించి మాట్లాడాడని, మద్యం తాగాడని సాక్ష్యం చెప్పాలని, వీడియో తీసుకుంటామని తనను బెదిరిస్తూ వేధిస్తున్నారని, వేటపాలెం స్టేషన్ హౌస్ ఆఫీసర్ పి జనార్ధన్ పై, వారి పోలీసు సిబ్బంది పై, ఈ వ్యవహారంలో కుట్ర దారులు అందరి పై చట్టపరమైన చర్యలు తీసుకుని, వారందరి నుండి మా కుటుంబానికి, మా ఆస్తులకు రక్షణ కల్పించి, అక్రమ కేసుల నుండి మమ్మల్ని కాపాడి రక్షణ కల్పించాల్సిందిగా బాధితుని భార్య పింజుల భారతి ఫిర్యాదులో పేర్కొన్నారు.

# ఆపదలో అండగా ఎమ్మెల్యే "సాంబన్న" పేద ముస్లిం కుటుంబానికి ఎమ్మెల్యే ఏలూరి చేయూత

## క్యాన్సర్‌తో బాధపడుతున్న కుంకలమర్రు రిజ్వానాకు రూ.6 లక్షల ఎల్ఓసి మంజూరు

## వ్యవసాయ కూలీ కుటుంబానికి ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా భరోసా



(షణ్ముఖ వెలుగు, పర్చూరు, ఫిబ్రవరి 27)
ఆర్థిక ఇబ్బందులతో వైద్యం అందక ఇబ్బంది పడుతున్న పేద ముస్లిం వ్యవసాయ కూలీ కుటుంబానికి ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు అండగా నిలిచారు. కుంకలమర్రు గ్రామానికి చెందిన రిజ్వానా క్యాన్సర్‌తో బాధపడుతున్న నేపథ్యంలో, ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా రూ.6 లక్షల ఎల్ఓసి మంజూరు చేయించి అత్యవసర చికిత్సకు మార్గం సుగమం చేశారు. దీంతో ఆ కుటుంబానికి ఆర్థిక చేయూత అందించి ఎమ్మెల్యే ఏలూరి కొండంత అండగా నిలిచారు. ఆపదలో ఉన్న పేద కుటుంబాలకు అండగా నిలుస్తూ పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు మరోసారి సేవాభావాన్ని చాటిచెప్పారు. మండలంలోని కుంకలమర్రు గ్రామానికి చెందిన రిజ్వానా భాషా దంపతులు వ్యవసాయ కూలీలుగా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నారు. రిజ్వానా క్యాన్సర్‌తో బాధపడుతూ అత్యవసర వైద్యం అవసరమైంది. గుంటూరులోనే ఓ ప్రవేట్ ఆసుపత్రిలో చికిత్సకు వెళ్లారు. ఆర్థిక పరిస్థితి అంతంతమాత్రంగా ఉన్న ఆ కుటుంబం చికిత్స చేయించుకునే పరిస్థితి లేకపోవడంతో దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. ఈ విషయం కుంకలమర్రు తెలుగుదేశం పార్టీ సీనియర్ నేత, పీఏసీఎస్ అధ్యక్షుడు బంగారు బాబు ద్వారా ఎమ్మెల్యే దృష్టికి వచ్చింది.

వెంటనే స్పందించిన ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు తన సిఫారసుతో ముఖ్యమంత్రి సహాయ నిధికి లేఖ రాశారు. ఎమ్మెల్యే ఏలూరి కృషితో ప్రభుత్వం రూ.6 లక్షల ఎల్ఓసి మంజూరు చేసింది. ఆ మొత్తాన్ని చెక్కు రూపంలో కుటుంబ సభ్యులకు అందజేశారు. వ్యవసాయ కూలీలుగా జీవనం సాగిస్తున్న ఈ కుటుంబం ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతోంది. రోజువారీ కూలి ఆదాయంతోనే కుటుంబాన్ని పోషిస్తున్న పరిస్థితుల్లో భారీ వైద్య ఖర్చులు భరించడం వారికి సాధ్యంకాలేదు. ఎమ్మెల్యే చొరవతో ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ఎల్ఓసి మంజూరు కావడంతో రిజ్వానాకు అవసరమైన వైద్యం అందుబాటులోకి వచ్చింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, "పేదల ఆరోగ్యం ప్రభుత్వానికి ప్రాధాన్యం. అత్యవసర వైద్యం అవసరమైన ప్రతి అర్హ కుటుంబానికి సహాయం అందేలా చర్యలు తీసుకుంటాం" అని తెలిపారు.సహాయం అందినందుకు రిజ్వానా కుటుంబ సభ్యులు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావుకు కృతజ్ఞతలు తెలిపారు. గ్రామస్తులు కూడా ఆయన సేవా దృక్పథాన్ని అభినందిస్తూ, పేదల పక్షాన నిలిచే నాయకుడిగా ప్రశంసించారు.

# ఈ ఏడాది చివరికి 10 లక్షల పైగా గృహ ప్రవేశాలు జరిపిస్తాం

## అసెంబ్లీలో సీఎం చంద్రబాబు ప్రకటన



**ఈ ఏడాది డిసెంబర్ నాటికి 10 లక్షల ఇళ్లు లబ్ధిదారులకు అందజేత**
**నిరుపేదలకు పట్టణాల్లో 2 సెంట్లు, గ్రామాల్లో 3 సెంట్ల స్థలం ఉచితం**
**రైతు సంక్షేమమే లక్ష్యంగా వ్యవసాయాభివృద్ధికి ఐదు సూత్రాల అమలు**
**లక్ష కోట్లతో రాయలసీమను హార్టికల్చర్ హబ్‌గా మార్చేందుకు ప్రణాళికలు**
**ఏలూరులో ప్రపంచంలోనే అతిపెద్ద కోకో సిటీ ఏర్పాటు**

**(షణ్ముఖ వెలుగు, అమరావతి,ఫిబ్రవరి 27)**

రాష్ట్రంలోని ప్రతి పేదవాడికి సొంతింటి కలను నిజం చేయడమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, ఈ దిశగా యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకుంటున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. నేడు అసెంబ్లీ సమావేశాల్లో భాగంగా గృహ నిర్మాణం, వ్యవసాయ శాఖల పద్దులపై జరిగిన చర్చలో సీఎం ప్రసంగించారు. ఈ ఏడాది చివరి నాటికి రాష్ట్రవ్యాప్తంగా రికార్డు స్థాయిలో 10 లక్షలకు పైగా ఇళ్లకు గృహ ప్రవేశాలు జరిపిస్తామని ఆయన సభలో ప్రకటించారు. ఇప్పటికీ ఇళ్లు లేని నిరుపేదలు ఎవరైనా ఉంటే వెంటనే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

**2029 నాటికి అందరికీ ఇళ్లు**

రాష్ట్రంలో ఏ ఒక్క పేద కుటుంబం కూడా ఇల్లు లేకుండా ఉండకూడదన్నదే తమ ధ్యేయమని సీఎం తెలిపారు. రాయచోటి నుంచి ఇప్పటికే 3 లక్షల ఇళ్ల నిర్మాణాలను ప్రారంభించామని, ఈ ఏడాది ఉగాది నాటికి దాదాపు 3 లక్షల ఇళ్లలో లబ్ధిదారులు చేరేలా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. జూన్ నాటికి మరో 2.26 లక్షలు, సెప్టెంబర్ నాటికి ఇంకో 2.10 లక్షల ఇళ్లకు గృహ ప్రవేశాలు పూర్తి చేస్తామని స్పష్టమైన ప్రణాళికను వివరించారు. 2029 నాటికి రాష్ట్రంలోని పేదలందరికీ పక్కా ఇళ్లు కట్టించడంతో పాటు, అర్హులైన వారికి ఉచితంగా ఇంటి స్థలాలు కూడా పంపిణీ చేస్తామని భరోసా ఇచ్చారు. పట్టణ ప్రాంతాల్లో 2 సెంట్లు, గ్రామీణ ప్రాంతాల్లో 3 సెంట్ల చొప్పున స్థలాన్ని కేటాయించనున్నట్లు వెల్లడించారు. రాష్ట్రంలో ప్రస్తుతం 2.20 లక్షల కుటుంబాలకు సొంత జాగా లేదని గుర్తించామన్నారు.

**అక్రమార్కులపై ఉక్కుపాదం**

గత ప్రభుత్వ హయాంలో గృహ నిర్మాణ రంగం, ఇసుక విధానాల్లో జరిగిన అవినీతిపై సీఎం చంద్రబాబు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. పేదల ఇళ్ల పేరుతో గత పాలకులు భారీగా అక్రమాలకు పాల్పడ్డారని, ఇసుక విధానాన్ని అస్తవ్యస్తం చేసి దోచుకున్నారని ఆరోపించారు. ఈ కుంభకోణాల్లో భాగస్వాములైన ప్రతి ఒక్కరిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని, త్వరలోనే దీనికి సంబంధించిన కార్యాచరణను ప్రకటిస్తామని హెచ్చరించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి అందరికీ ఇళ్లు ఇచ్చే బాధ్యతను చిత్తశుద్ధితో నిర్వర్తిస్తాయని తెలిపారు.

**వ్యవసాయానికి 'పంచ సూత్రాల' ఊతం**

రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు వెన్నెముక అయిన వ్యవసాయ రంగాన్ని లాభసాటిగా మార్చేందుకు ప్రభుత్వం 'పంచ సూత్రాల' విధానాన్ని అమలు చేస్తోందని ముఖ్యమంత్రి వివరించారు. అగ్రిటెక్, నీటి భద్రత, డిమాండ్ ఉన్న పంటల సాగు, ఫుడ్ ప్రాసెసింగ్, మార్కెటింగ్ సదుపాయాలు కల్పించడం ద్వారా రైతులను ఆదుకుంటామని చెప్పారు. వ్యవసాయంలో యాంత్రీకరణతో పాటు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) సేవలను కూడా రైతులకు అందుబాటులోకి తెస్తామన్నారు.

రైతులకు ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఏటా రూ.20,000 ఆర్థిక సాయాన్ని అందిస్తున్నామని సీఎం గుర్తుచేశారు. ఇందులో రాష్ట్ర వాటాగా రూ.14,000, కేంద్రం వాటాగా రూ.6,000 కలుపుకుని పంపిణీ చేస్తున్నామన్నారు. ఇప్పటికే 47 లక్షల మంది రైతులకు రెండు విడతల్లో రూ.6,309 కోట్లు జమ చేశామని, గత ప్రభుత్వం బకాయి పెట్టిన రూ.1,670 కోట్లు కూడా తామే చెల్లించామని తెలిపారు. ధాన్యం కొనుగోలు చేసిన 24 గంటల్లోనే రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేస్తున్నామని, ఇప్పటివరకు రూ.10,816 కోట్లు చెల్లించామని వివరించారు. ఉచిత విద్యుత్ కోసం 2025-26 బడ్జెట్‌లో రూ.13,722 కోట్లు కేటాయించామని, ఈ ఏడాది కొత్తగా 69 వేల వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు మంజూరు చేశామని చెప్పారు.

**రాయలసీమ ఇక ఉద్యాన హబ్**

రాష్ట్రంలో ఉద్యానవన, ఆక్వా రంగాల అభివృద్ధికి భారీ ప్రణాళికలు రూపొందించామని చంద్రబాబు తెలిపారు. రాయలసీమను 'హార్టికల్చర్ హబ్'గా తీర్చిదిద్దేందుకు రూ.30 వేల కోట్లతో క్లస్టర్ ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. ప్రైవేటు పెట్టుబడులతో కలిపి మొత్తం రూ.1 లక్ష కోట్లతో సీమ రూపురేఖలు మారుస్తామని ధీమా వ్యక్తం చేశారు. ప్రస్తుతం 400 మిలియన్ మెట్రిక్ టన్నులుగా ఉన్న ఉత్పత్తులను 1000 మిలియన్ మెట్రిక్ టన్నులకు పెంచడమే లక్ష్యమన్నారు. అలాగే, ఏలూరులో ప్రపంచంలోనే అతిపెద్ద 'కోకో సిటీ'ని ఏర్పాటు చేయబోతున్నట్లు సీఎం సంచలన ప్రకటన చేశారు.

నీటి భద్రతపై తీసుకున్న చర్యల వల్ల అన్నమయ్య జిల్లాలో భూగర్భ జలాలు 6.67 మీటర్ల మేర పెరిగాయని, రాష్ట్ర సగటున 7.31 మీటర్ల మేర భూగర్భ జలాలు ఉన్నాయని సంతోషం వ్యక్తం చేశారు. దీనివల్ల రూ.95 కోట్ల విలువైన విద్యుత్ ఆదా అయ్యిందని చెప్పారు. కౌలు రైతులకు కూడా ప్రభుత్వం అండగా ఉంటుందని, సాగునీటి సంఘాలను బలోపేతం చేసి రైతన్నకు భరోసా కల్పిస్తామని సీఎం చంద్రబాబు తన ప్రసంగంలో స్పష్టం చేశారు.

# పవన్ క్యాంపు కార్యాలయంలోకి చొరబడిన వ్యక్తి... రెండు వాహనాలు ధ్వంసం!

**జనసేన కేంద్ర కార్యాలయంలోకి చొరబడిన వ్యక్తి**
**డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కాన్వాయ్ వాహనాల ధ్వంసం**
**నిందితుడు శ్రీకాకుళం జిల్లాకు చెందిన నీలాద్రిగా గుర్తింపు**
**పొంతనలేని సమాధానాలు చెబుతుండటంతో మానసిక స్థితిపై అనుమానాలు**
**ఘటనపై ఐజీ, ఎస్పీల విచారణ.. రాజకీయ కుట్ర కోణంలోనూ దర్యాప్తు**



**(షణ్ముఖ వెలుగు, అమరావతి,ఫిబ్రవరి 27)**

ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ క్యాంపు కార్యాలయం వద్ద శుక్రవారం అనూహ్య ఘటన చోటుచేసుకుంది. మంగళగిరిలో జనసేన ప్రధాన కార్యాలయంలోకి ఓ అజ్ఞాత వ్యక్తి ప్రవేశించి వీరంగం సృష్టించాడు. పవన్ కల్యాణ్ కాన్వాయ్‌లోని రెండు వాహనాలపై దాడి చేసి ధ్వంసం చేయడంతో కార్యాలయ ఆవరణలో కాసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది.

పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శుక్రవారం ఉదయం విజయవాడ నుంచి ఆటోలో వచ్చిన సదరు వ్యక్తి నేరుగా కార్యాలయం లోపలికి ప్రవేశించాడు. చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ (సీఎస్ఓ) గదిలోకి వెళ్లి సుమారు పావుగంట సేపు అక్కడే గడిపాడు. భద్రతా సిబ్బంది అతడిని ప్రశ్నించడంతో వాగ్వాదానికి దిగి, వారిని తోసివేశాడు. అనంతరం అక్కడే ఉన్న ఒక కర్రను తీసుకుని కాన్వాయ్‌లోని వాహనాల అద్దాలను పగులగొట్టాడు. వెంటనే అప్రమత్తమైన జనసేన సిబ్బంది అతడిని అదుపులోకి తీసుకుని మంగళగిరి పోలీసులకు సమాచారం అందించారు.

నిందితుడిని శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురం ప్రాంతానికి చెందిన నీలాద్రిగా పోలీసులు గుర్తించారు. ప్రజావాణి కార్యక్రమంలో తన సమస్యపై వినతిపత్రం ఇచ్చేందుకు వచ్చినట్లు ప్రాథమిక సమాచారం. అయితే, విచారణ సమయంలో అతడు పొంతనలేని సమాధానాలు ఇస్తుండటంతో, అతడికి మతిస్థిమితం సరిగా లేదేమోనని పోలీసులు అనుమానిస్తున్నారు.

ఘటన తెలిసిన వెంటనే గుంటూరు రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి, గుంటూరు ఎస్పీ వకుల్ జిందాల్ పోలీస్ స్టేషన్‌కు చేరుకుని నిందితుడిని స్వయంగా విచారించారు. కేవలం మానసిక స్థితి కారణంగానే దాడి చేశాడా? లేక దీని వెనుక ఏదైనా రాజకీయ కుట్ర దాగి ఉందా? అనే కోణంలో పోలీసులు లోతుగా దర్యాప్తు చేస్తున్నారు. గతంలో ఇదే కార్యాలయం వద్ద డ్రోన్ సంచారం కలకలం రేపిన నేపథ్యంలో, తాజా ఘటనతో జనసేన శ్రేణుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది.

# భూయజమాని సంతృప్తి చెందేలా రీసర్వే

**(షణ్ముఖ వెలుగు, అమరావతి,ఫిబ్రవరి 27)**



జగన్ ప్రభుత్వం రూ.700 కోట్లు వెచ్చించి సరిహద్దు రాళ్లు పాతడంపై చూపిన శ్రద్ధ.. భూముల రీసర్వేపై చూపించలేదని రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్ విమర్శించారు. కూటమి ప్రభుత్వం అన్ని సమస్యలు పరిష్కరించేలా, అందరికీ ఆమోదయోగ్యంగా రీసర్వే చేస్తున్నట్లు చెప్పారు. పట్టాదారు పాసు పుస్తకాల జారీపై నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాశ్ అడిగిన ప్రశ్నకు మంత్రి సత్యప్రసాద్ బదులిచ్చారు. 'కేంద్రం 2016లో డిజిటల్ ఇండియా ల్యాండ్ రికార్డ్స్ మోడ్రనైజేషన్ ప్రోగ్రాం ఆరంభించింది. అందులో భాగంగా అప్పటి తెదేపా ప్రభుత్వం సమగ్ర సర్వే కోసం 2018 సెప్టెంబరులో జీవో ఇచ్చింది. భూధార్‌లో వివరాలు మార్చేందుకు వీలుగా 2019 ఫిబ్రవరిలో గెజిట్ విడుదల చేసింది. టెండర్ల ప్రక్రియ అప్పుడే పూర్తయ్యింది. వైకాపా ప్రభుత్వంలో తొలి నాలుగేళ్లు దీన్ని పట్టించుకోకుండా, చివరి ఏడాదిలో హడావిడి చేశార'ని విమర్శించారు. కూటమి ప్రభుత్వం వచ్చాక రీసర్వే కోసం గ్రామసభలు, రెవెన్యూ సదస్సులు పెట్టి, లక్షల సంఖ్యలో అర్జీలను పరిష్కరిస్తున్నామని మంత్రి వివరించారు. 'ఇప్పటికే 6,688 గ్రామాల్లో, 86.44 లక్షల ఎకరాల్లో రీసర్వే పూర్తయింది. 19.93 లక్షల పట్టాదారు పాస్‌పుస్తకాలు జారీచేశాం. 14 అంశాలను 223 రోజుల గడువుతో, భూయజమాని సంతృప్తి చెందేలా రీసర్వే చేస్తున్నాం' అని తెలిపారు.

# అనర్హుల ఇళ్ల పట్టాలు రద్దుచేస్తాం

## గృహనిర్మాణశాఖ మంత్రి పార్థసారథి

**(షణ్ముఖ వెలుగు, అమరావతి,ఫిబ్రవరి 27)**



గత ప్రభుత్వంలో ఇళ్లపట్టాల జారీలో అక్రమాలకు పాల్పడ్డారని, నేతలు తమకు నచ్చిన వారికి పట్టాలు ఇచ్చిన వైనంపై విచారణ జరిపించి, అనర్హుల పట్టాలను రద్దు చేస్తామని గృహనిర్మాణ శాఖ మంత్రి పార్థసారథి తెలిపారు. కొన్నిచోట్ల రైతుల నుంచి భూములు కొనుగోలు చేయకముందే, పట్టాలిచ్చేశారని పేర్కొన్నారు. అలాంటి వారికి పట్టణాల్లో 2 సెంట్లు, గ్రామాల్లో 3 సెంట్లు చొప్పున ఇళ్ల స్థలాలు అందజేస్తామని చెప్పారు. కాకినాడ గ్రామీణ ఎమ్మెల్యే పంతం వెంకటేశ్వరరావు పీఎంఏవైపై అడిగిన ప్రశ్నకు మంత్రి పార్థసారథి జవాబిచ్చారు. 'పట్టా ఒకరికిస్తే, అక్కడ వేరొకరు ఇళ్లు నిర్మించుకున్నవి చాలాచోట్ల ఉన్నాయి. ఇద్దరినీ కూర్చోబెట్టి సమస్యలు పరిష్కరించేలా చూస్తాం. ఇందులో అధికారుల నిర్లక్ష్యముంటే వారిపైనా చర్యలు తీసుకుంటామ'ని స్పష్టంచేశారు. అంతకుముందు ఎమ్మెల్యే వెంకటేశ్వరరావు మాట్లాడుతూ కాకినాడలో గత ప్రభుత్వంలో ఇళ్ల పట్టాల జారీలో అక్రమాలకు పాల్పడ్డారని, ఎన్నికల ముందు నేతలే నకిలీ పట్టాలు ఇచ్చేశారని పేర్కొన్నారు.

# సైనిక్ స్కూల్స్ ప్రవేశ పరీక్ష 2026 ఫలితాలు విడుదల




**(షణ్ముఖ వెలుగు, అమరావతి,ఫిబ్రవరి 27)**

ఆలిండియా సైనిక్ స్కూల్స్ ప్రవేశ పరీక్ష ఫలితాలు విడుదలయ్యాయి. 6, 9 తరగతుల్లో ప్రవేశాల కోసం నిర్వహించిన రాత పరీక్షకు సంబంధించి ఇటీవల ప్రొవిజినల్ కీ విడుదల చేసిన ఎన్‌టీఏ అధికారులు.. తాజాగా తుది కీ, ఫలితాలను వెబ్‌సైట్‌లో అందుబాటులోకి తీసుకొచ్చారు. విద్యార్థులు తమ అప్లికేషన్ నంబర్, పాస్‌వర్డ్, క్యాప్చా కోడ్ ఎంటర్ చేసి స్కోరు కార్డుని డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. అలాగే, ఈ పరీక్షలో విద్యార్థులు సాధించిన మార్కుల ఆధారంగా రూపొందించిన ర్యాంకుల జాబితాలను సైతం వేర్వేరుగా విడుదల చేశారు.

**స్కోరు కార్డు కోసం క్లిక్ చేయండి**

సైనిక్ స్కూల్స్/న్యూ సైనిక్ స్కూల్స్‌లో ఆరు, తొమ్మిదో తరగతుల్లో ప్రవేశాల కోసం జనవరి 18న దేశవ్యాప్తంగా 190 సిటీల్లోని 464 పరీక్షా కేంద్రాల్లో ఈ ప్రవేశ పరీక్ష నిర్వహించిన విషయం తెలిసిందే. ఇందులో అర్హత సాధించిన విద్యార్థులకు సైనిక్ స్కూల్స్ సొసైటీ ఈ-కౌన్సెలింగ్ విధానంలో ప్రవేశాలు కల్పిస్తుంది. అడ్మిషన్ల ప్రక్రియకు సంబంధించి ఏవైనా సందేహాలు ఉంటే ఈమెయిల్ ఐడీ ఖఎఎఅంంఅశీఅ.౦౦౦ఏస్త్రశీజ.ఱఅకు పంపవచ్చని అధికారులు సూచించారు.

# స్టీల్ బ్రిడ్జ్ నిర్మాణం త్వరగా పూర్తి చేయండి మంత్రి నారాయణ

**(షణ్ముఖ వెలుగు, అమరావతి,ఫిబ్రవరి 27)**



ఉండవల్లిలోని స్టీల్ బ్రిడ్జ్ నిర్మాణ పనులను మంత్రి నారాయణ పరిశీలించారు. సీడ్ యాక్సిస్ రోడ్డును పాత గుంటూరు హైవేకు కలిపేలా ప్రభుత్వం స్టీల్ బ్రిడ్జ్ నిర్మాణం చేపడుతోంది. ఈ పనులను పరిశీలించిన మంత్రి.. కాంక్రీట్ పిల్లర్లపై స్టీల్ గడ్డర్ల ఏర్పాటు గురించి అడిగి తెలుసుకున్నారు. మొత్తం 88 గడ్డర్లకు గానూ 20 గడ్డర్లు పూర్తయ్యాయని ఇంజినీర్లు తెలిపారు. స్టీల్ బ్రిడ్జ్ త్వరగా పూర్తి చేసి.. అందుబాటులోకి తీసుకురావాలని మంత్రి వారికి సూచించారు.

# క్రీడాకారులకు ఉద్యోగ అర్హతల్లో సడలింపులు పరిశీలిస్తున్నాం క్రీడల శాఖ మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

**(షణ్ముఖ వెలుగు, అమరావతి,ఫిబ్రవరి 27)**



పోలీస్, ఎక్సైజ్, అటవీశాఖ ఉద్యోగాల రాతపరీక్షల్లో క్రీడాకారులకు 15 శాతం మార్కులు మినహాయింపునివ్వడంపై సీఎంతో చర్చించి నిర్ణయం తీసుకుంటామని యువజన, క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి తెలిపారు. కూటమి ప్రభుత్వం ఉద్యోగాల్లో 3 శాతం క్రీడా కోటా అమలు చేస్తోందని, దీనివల్ల డీఎస్సీ పోస్టుల్లో 421 పోస్టులు ఆటల్లో నైపుణ్యం ఉన్నవారికి దక్కాయని తెలిపారు. రాతపరీక్షలతో సంబంధం లేకుండా, క్రీడా అర్హతను బట్టి ఈ అవకాశం కల్పించినట్లు చెప్పారు.

ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ క్రీడాకారులు నిత్యం ఐదారు గంటలు ప్రాక్టీస్‌కు సమయం కేటాయిస్తారని, రాతపరీక్షల్లో ఇతర అభ్యర్థులతో పోటీపడలేరని తెలిపారు. వీరికి మార్కుల్లో మినహాయింపు ఇవ్వాలని కోరారు.

## అంగన్వాడి కార్యాలయం తనిఖీ





(షణ్ముఖ వెలుగు, పామూరు, ఫిబ్రవరి 27)

మండలంలోని పమట కట్ట కింద పల్లి గ్రామంలో అంగన్వాడి కార్యాలయాన్ని తహశీల్దార్ వాసుదేవరావు, కనిగిరి ఏఎంసి ఛైర్మన్ యారవ రమ శ్రీనివాసులు శుక్రవారం ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు అందుతున్న సౌకర్యాలు, ఇతరత్రా విషయాలను గురించి అడిగి తెలుసుకున్నారు.

## క్విస్ ఇంజనీరింగ్ కళాశాలకు ప్రైడ్ ఆఫ్ నేషన్ అవార్డు

### ఉత్తమ విద్యను అందిస్తున్న కాలేజిగా గుర్తింపు

### ఒరిస్సా గవర్నర్ చేతులమీదుగా అవార్డు



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఫిబ్రవరి 27)

ఒంగోలులోని క్విస్ ఇంజనీరింగ్ కళాశాలకు ప్రైడ్ ఆఫ్ నేషన్ అవార్డు దక్కింది. ఆసియా టుడే మీడియా వారు ఏటా విద్య, వైద్య, ఫార్మా, వ్యాపార, పర్యావరణ రంగాల్లో విశేష సేవలు అందించే వారిని గుర్తించి ఈ అవార్డు ప్రదానం చేస్తారు. ఏపీలో సాంకేతిక విద్యారంగంలో ఉత్తమ సేవలు, ఇంజనీరింగ్ విద్యలో సరికొత్త విధానంలో విద్యాబోధన, రిసెర్చ్‌ని ప్రోత్సహిస్తూ సమాజానికి ఉపయోగపడే ఆవిష్కరణలు, ఉత్తమ ప్లే స్ మెంట్స్, వివిధ టెక్నాలజీలపై విద్యార్థులకు ప్రత్యేక విద్యాబోధన తదితర అంశాల్లో సేవలు అందిస్తున్నందుకు గాను క్విస్ కళాశాలను ప్రైడ్ ఆఫ్ నేషన్ అవార్డుకు ఎంపిక చేశారు. విశాఖలో గురువారం నిర్వహించిన ఈ అవార్డు ప్రదాన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఒడిశా గవర్నర్ కంభంపాటి హరిబాబు, కేంద్రమంత్రి ఎస్పీ సింగ్ భాగల్, రాజ్యసభ సభ్యులు గొల్లపూడి బాబురావు ఈ అవార్డును అందజేశారు. కళాశాల తరపున కార్యక్రమానికి హాజరైన ప్రిన్సిపల్ డాక్టర్ వై.వి. హనుమంతరావు, ట్రైనింగ్ అండ్ ప్లేస్ మెంట్ డీన్ జగదీశ్ అవార్డును అందుకున్నారు. విద్యార్థులకు విలువతో కూడిన, ఉత్తమమైన, లేటెస్ట్ టెక్నాలజీని అందిపుచ్చుకునేలా తమ కళాశాలలో విద్యాబోధన ఉంటుందని విద్యాసంస్థల అధినేత డాక్టర్ నిడమానూరి సూర్య కల్యాణ్ చక్రవర్తి, ఎగ్జిక్యూటివ్ వైస్ ఛైర్మన్ డాక్టర్ నిడమానూరి శ్రీ గాయత్రి దేవి అన్నారు. ఈ అవార్డు రావడం చాలా ఆనందంగా ఉందని, ఈ అవార్డు తమ బాధ్యతను మరింత పెంచిందని ఈ సందర్భంగా తెలియజేశారు. కళాశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు, సిబ్బంది తదితరులకు వారు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

## ఘనంగా ఎస్ఎస్ఎన్ డిగ్రీ కళాశాల వార్షిక వేడుకలు




(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఫిబ్రవరి 27)

నగరంలోని మంగమూరు రోడ్డులో గల ఎస్ఎస్ఎన్ డిగ్రీ కాలేజీ వార్షిక వేడుకలు శుక్రవారం ఘనంగా జరిగాయి. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. అనంతరం డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ యల్లటూరి సత్యనారాయణరెడ్డి మాట్లాడుతూ గత మూడున్నర దశాబ్దాల కాలంలో ఎస్ఎస్ఎన్ విద్యా సంస్థల ద్వారా వేలాది మంది విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు అందించినట్లు తెలిపారు. కొంత గ్యాప్ వచ్చినప్పటికీ తల్లిదండ్రులు, విద్యార్థులు తమ కాలేజీ పై పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము చేయకుండా నిలబెట్టుకుంటున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో రాజేంద్ర, ఉపాధ్యాయ, ఉపాధ్యాయేతర సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# సమగ్రంగా 2027 జనాభా లెక్కల సేకరణ దిశగా చర్యలు

### సెన్సస్ విభాగ అసిస్టెంట్ డైరక్టర్ ఎం శ్రీనివాసరావు






(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఫిబ్రవరి 27)

సమగ్రంగా 2027 జనాభా లెక్కల సేకరణ దిశగా చర్యలు తీసుకుంటున్నట్లు సెన్సస్ విభాగ అసిస్టెంట్ డైరెక్టర్ ఎం శ్రీనివాసరావు తెలిపారు. ఈ ప్రక్రియలో భాగస్వాములు అయ్యే జిల్లా, డివిజన్, మండల స్థాయి అధికారులకు శుక్రవారం ప్రకాశం భవనంలో ప్రారంభమైన శిక్షణ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. మూడు రోజుల పాటు ఈ శిక్షణ కార్యక్రమాలు ఉంటాయి. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ ఈసారి జనాభా లెక్కల సేకరణ డిజిటల్ విధానంలో చేపట్టబోతున్నట్లు చెప్పారు. ఇందులో భాగంగా ప్రతి మండలాన్ని రెవెన్యూ గ్రామాలుగా, ప్రతి గ్రామాన్ని బ్లాకులుగా విభజించి వివరాలు సేకరిస్తామని తెలిపారు. మొదటి విడతలో ఇళ్ల గణన, రెండవ విడతలో జనాభా గణన ఉంటుందన్నారు. రెండవ విడతలోనే కుల గణన కూడా చేస్తామన్నారు. ఇందులో భాగంగా ఈ ఏడాది మే నెలలో ఇళ్ల గణన ఉంటుందని చెప్పారు. దీనికంటే ముందుగానే ప్రజలే స్వయంగా తమ వివరాలను ఇంటి వద్ద నుంచే నమోదు చేసుకునేలా ప్రత్యేక పోర్టల్ ను తీసుకువచ్చామన్నారు. ఇంటి నిర్మాణ రకం, అందులో ఉన్న విద్యుత్, తాగునీటి సౌకర్యాలు వంటి 33 వివరాలను ఈ సర్వేలో సేకరించబోతున్నట్లు తెలిపారు. ఈ వివరాలు సేకరించే ఎన్యూమరేటర్లు, సూపర్వైజర్లకు ప్రజలందరూ సహకరించాలని ఆయన కోరారు. డిఆర్ఓ బి చిన ఓబులేసు మాట్లాడుతూ విధివిధానాల గురించి స్పష్టమైన అవగాహన కల్పించేలా పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఈ శిక్షణ కార్యక్రమంలో వివరించేలా ఏర్పాట్లు చేశామన్నారు. ఈ శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్నవారు తిరిగి మండల స్థాయిలోనూ ఎన్యూమరేటర్లు, సూపర్వైజర్లకు ఇలాంటి శిక్షణ కార్యక్రమం నిర్వహించాల్సి ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈవో చిరంజీవి, ఆర్డిఓ లక్ష్మీ ప్రసన్న, డీఈవో రేణుక, మాస్టర్ ట్రైనర్లు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు, తహశీల్దార్లు, అసిస్టెంట్ స్టాటస్టికల్ ఆఫీసర్లు పాల్గొన్నారు.



## మార్కాపురం జిల్లాకు కాటమరాజు పేరు పెట్టాలి

### 139 బీసీ కులాల జేఏసీ రాష్ట్ర చైర్మన్ మిరియం శ్రీనివాసులు



(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, ఫిబ్రవరి 27)

మార్కాపురం జిల్లాకు కాటమరాజు పేరు పెట్టాలని 139 బీసీ కులాల జేఏసీ రాష్ట్ర చైర్మన్ మిరియం శ్రీనివాసులు శుక్రవారం ఒక ప్రకటనలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కి విజ్ఞప్తి చేశారు. ప్రస్తుతం రాష్ట్రంలో ఎన్టీఆర్ జిల్లా గాను, వైయస్సార్ జిల్లా గాను మరెందరో పేర్లతో జిల్లాలు ఉన్న సందర్భంగా యాదవులకు ఆరాధ దైవమైన కాటమరాజు పేరుతో మార్కాపురం జిల్లా ప్రకటించాలని అత్యధిక బీసీలు, యాదవుల ఆకాంక్ష అని తెలిపారు. ఉగాది సందర్భంగా ప్రతి సంవత్సరము మార్కాపురానికి అతి సమీపంలో లక్షలాది ప్రజలు కాటమరాజు తిరునాలను ఘనంగా జరుపుకుంటారని ప్రజల ఆకాంక్ష మేరకు ముఖ్యమంత్రి కాటంరాజు జిల్లాగా పేరు ఏర్పాటు చేయాలని, ఇచ్చిన మాట ప్రకారం మార్కాపురం జిల్లా ఏర్పాటు చేసిన సందర్భంగా మార్కాపురం జిల్లా పేరును కాటమరాజు జిల్లాగా ఏర్పాటు చేసి ప్రజల ఆకాంక్షను నెరవేర్చాలని ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేశారు

## చెక్కు అందజేసిన ఏల్చూరి

(షణ్ముఖ వెలుగు, సిఎస్‌పురం, ఫిబ్రవరి 27)

ఒంగోలు పార్లమెంట్ అధ్యక్షుడు, కనిగిరి ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి ఆదేశాల మేరకు సియస్‌పురం మండల పార్టీ అధ్యక్షుడు బోబ్బరి రమేష్ అధ్యక్షతన స్థానిక పార్టీ కార్యాలయంలో కోయిలంపాడుకు చెందిన ఏల్చూరి శ్రీనివాసులుకు సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కనీస వేతనాల సలహా మండలి సభ్యులు డాక్టర్ బొమ్మన బోయిన వెంగయ్య, కోవిలంపాడు గ్రామ పార్టీ అధ్యక్షులు ఆమడసాని బాలకేశవరెడ్డి, కొత్తపల్లి గ్రామ పార్టీ అధ్యక్షులు వీ వెంకటరామరాజు, అంబవరం గ్రామ పార్టీ అధ్యక్షులు రామరాజు రుద్రరాజు, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు రామకృష్ణంరాజు, మండల మైనారిటీ సెల్ అధ్యక్షులు కూటాగుళ్ల మహబూబ్ బాషా, చింతపూడు గ్రామ పార్టీ అధ్యక్షులు గురుకృష్ణ, యూనిట్ ఇంఛార్జి చావ చంద్రశేఖర్, మాజీ తెలుగు యువత అధ్యక్షులు రమణయ్య, అవుల శ్రీనివాసులు, బాలకశయ్య, తిరుపతయ్య, తెలుగుదేశం పార్టీ నాయకులు, అభిమానులు పాల్గొన్నారు.



## నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా మార్చడమే లక్ష్యంగా అక్షరాంధ్ర



(షణ్ముఖ వెలుగు, చిన్నగంజాం, ఫిబ్రవరి 27)

నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా మార్చడమే లక్ష్యంగా అక్షరాంధ్ర కార్యక్రమం నిర్వహిస్తున్నామని డివిజనల్ సూపర్వైజర్ మనోరంజన్ అన్నారు. శుక్రవారం మండలంలోని సోపిరాల నందు వెలుగు డిఆర్డిఏ ఆధ్వర్యంలో ఎపిఎమ్ సుబ్బారావు పర్యవేక్షణలో జరుగుతున్న అక్షరాంధ్ర కార్యక్రమన్ని డివిజనల్ సూపర్వైజర్ మనోరంజన్ పరిశీలించారు. దీనిలో భాగంగా గ్రామంలోని శ్రీ లక్ష్మి గ్రామ సంఘం పరిధిలో 10 మంది అభ్యాసకులను కలిసి వాళ్ళతో అక్షరాంధ్ర పై మాట్లాడారు. అక్షరాంధ్ర కార్యక్రమంలో భాగంగా మహిళలకు కనీస అవసరలైన బ్యాంకులో డబ్బులు కట్టుకునే విధానం గురించి, బస్సు పేరు కొనుక్కోవడానికి గురించి, చిన్న చిన్న లెక్కలు చేయటానికి ఇది ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు.

ఏపీఎం సుబ్బారావు మాట్లాడుతూ మన మండలంలో 3200 మందిని నమోదు చేయడం జరిగింది. వారికి 255 మంది టీచర్స్‌ని కూడా ఐడెంటిఫై చేసి స్వచ్ఛందంగా విద్యను అభ్యసించటం జరుగుతుందన్నారు. దీనిలో భాగంగా వచ్చే నెల నాలుగో తేదీ నాడు ఫ్రీ ఫైనల్ ఎగ్జామ్ జరుగనున్నట్లు మార్చి 15వ తేదీ నాడు ఫైనల్ ఎగ్జామ్ నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వివోఏ శ్రీలక్ష్మి, టీచర్ ఝాన్సీ రాణి, తదితరులు పాల్గొన్నారు.

# నాయకత్వ లక్షణాలను అధికారులు అలవర్చుకుని మంచి నాయకుడుగా పనిచేయాలి

## జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్




(షణ్ముఖ వెలుగు, బాపట్ల, ఫిబ్రవరి 27)

నాయకత్వ లక్షణాలను అధికారులు అలవర్చుకుని మంచి నాయకుడుగా పనిచేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ తెలిపారు. దివ్యాంగులు, ఎస్టీల ప్రత్యేక పిజిఆర్ఎస్ కార్యక్రమం శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లో జరిగింది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన బాధితులు వినతి పత్రాల ద్వారా తమ సమస్యలను విన్నవించుకున్నారు. తక్షణమే ఆయన వాటికి పరిష్కార మార్గం చూపారు. తదుపరి జిల్లా అధికారులు, మండల స్థాయి అధికారులకు ఆయన పలు సూచనలు చేశారు. అనంతరం "జాతీయ వార్షిక ప్రణాళిక-వృద్ధుల హక్కులు చట్టం" పై అవగాహన కల్పిస్తూ రూపొందించిన కరపత్రాలను కలెక్టర్ విడుదల చేశారు. పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతున్న నేపథ్యంలో తాగునీటి సమస్య లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. చేతిపంపులు, బోర్లు సక్రమంగా పనిచేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజలకు తాగునీటి సమస్య లేకుండా ప్రణాళికతో ముందస్తుగా నీటి వనరులను సమకూర్చుకోవాలన్నారు. జిల్లా అధికారులంతా కలిసికట్టుగా పనిచేస్తే ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. టీం వర్క్ తో మంచి ఫలితాలు, ప్రయోజనాలను ఇస్తుందన్నారు. ఇదే మాదిరిగా మండల స్థాయిలోని అధికారులందరూ సమన్వయంతో పని చేయాలన్నారు. మండల స్థాయి అధికారులను ఒకే చోట చేర్చి వర్క్ షాప్ నిర్వహించడం ద్వారా మంచి ఫలితాలు వస్తున్నాయన్నారు. ఇదే స్ఫూర్తితో అన్ని మండలాలలోని అధికారులకు వర్క్ షాప్ నిర్వహిస్తామన్నారు. వీటిని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. బాపట్ల సేవా సేతు కార్యక్రమంతో ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందని జిల్లా సంయుక్త కలెక్టర్ భావన వశిష్ట తెలిపారు. మంచి ఆలోచనలు, ప్రజలకు మేలు చేయాలనే దృక్పథంతో బాపట్ల సేవా సేతు కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ నూతనంగా ప్రవేశపెట్టారని ప్రశంసించారు. ఆయన హృదయంలో మెదిలిన ఆలోచనలు కార్యరూపం దాల్చడంతో ఎంతోమందిలో స్ఫూర్తినింపాయన్నారు. ఈ కార్యక్రమంలో డి ఆర్ ఓ జి.గంగాధర్ గౌడ్, ఉప కలెక్టర్ లవన్న, విభిన్న ప్రతిభావంతులు వృద్ధుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకురాలు సువార్త, జిల్లా అధికారులు, మండల స్థాయి అధికారులు, తదితరులు పాల్గొన్నారు.





# రిటైర్డ్ జడ్జి పర్యవేక్షణలో బాప్టిస్ట్ చర్చిలకు సంబంధించి ఎన్నికల నిర్వహణ



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఫిబ్రవరి 27)

బాప్టిస్ట్ చర్చిలకు సంబంధించి ఎన్నికల నిర్వహణ బాధ్యతను చెన్నై హైకోర్టు ప్రతిపాదించిన రిటైర్డ్ జడ్జి పర్యవేక్షణలో జరుగుతాయని గంగవరపు భాస్కరరావు, రావిపాటి వినోద్ స్పష్టం చేశారు. ఒంగోలులోని జువెట్ మెమోరియల్ బాప్టిస్ట్ చర్చి ప్రాంగణంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు వెల్లడించారు. కొంతమంది బాప్టిస్ట్ సంఘ నాయకులు చేస్తున్న ప్రకటనల నేపథ్యంలో చెన్నై హైకోర్టు ఇచ్చిన తీర్పును వారు మీడియాకు తెలిపారు. తమిళనాడు నుండి సికింద్రాబాద్ వరకు తమకు 30 పోల సమాజాల్లో 800 కు పైగా చర్చిలు ఉన్నట్లు తెలిపారు. వీటి పరిధిలో 10 లక్షల మంది సభ్యులు ఉన్నట్లు వివరించారు. ప్రాపర్టీ అసోసియేషన్ ఆఫ్ బాప్టిస్ట్ చర్చెస్ ప్రైవేట్ లిమిటెడ్ అక్రమాలకు పాల్పడిన నేపథ్యంలో, తాము వేసిన పిటిషన్ కు స్పందించిన చెన్నై హైకోర్టు పైన పేర్కొన్న బాప్టిస్ట్ చర్చెస్ ప్రైవేట్ లిమిటెడ్ ను ట్రస్ట్ షిప్ నుండి తొలగించి ట్రస్ట్ మేనేజ్మెంట్ కోసం ఎలక్షన్స్ నిర్వహించాలని ఆదేశించిందన్నారు.

# మార్చి 1 న శ్రీగిరిలో అఖండ హనుమాన్ చాలీసా పారాయణ

## శ్రీ గిరి దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్ పర్సన్ ఆలూరు ఝాన్సీ రాణి వెల్లడి



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఫిబ్రవరి 27)

ఒంగోలులోని కుర్తాళం శ్రీ సిద్దేశ్వరి పీఠ పాలిత శ్రీగిరి శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం ఆధ్వర్యంలో మార్చి 1వ తేదీ ఆదివారం జరగనున్నాయి. ఆదివారం ఉదయం 10 గంటలకు శ్రీ గిరి గో క్షేత్రంలో బాల బాలికలతో అఖండ హనుమాన్ చాలీసా పారాయణ కార్యక్రమంతో పాటు శ్రీగిరి క్షేత్ర పాలకుడు అభయాంజనేయ స్వామి వారికి విశేష పూజలు జరుగుతాయని శ్రీగిరి దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్ పర్సన్ ఆలూరు ఝాన్సీ రాణి, ఆర్జిత సేవల ధర్మకర్త ఆలూరు సుశీలా దేవి, కార్యనిర్వహణ ధర్మకర్త సి వి రామకృష్ణారావు, శ్రీగిరి దేవస్థానం ఉత్తర అమెరికా ప్రతినిధి డాక్టర్ ఆలూరు శ్రీనివాస చరణ్ రాజీవ్, ధర్మకర్తల మండలి ప్రతినిధులు వెల్లడించారు. ప్రముఖ ఆధ్యాత్మిక శిక్షణా సంస్థ చిన్మయ మిషన్ స్థాపించి 75 సంవత్సరాలు పూర్తి అయిన సందర్భాన్ని పురస్కరించుకుని చిన్మయ అమృతోత్సవం పేరిట మార్చి 1వ తేదీ ఆదివారం ఉదయం 10 గంటలకు శ్రీగిరి దేవస్థానం గో క్షేత్రంలో జరుగ నున్న అఖండ హనుమాన్ చాలీసా పారాయణ కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. పూర్తి వివరాలకు, పేర్ల నమోదుకు శ్రీ గిరి దేవస్థానం కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.



ప్రతి ఆదివారం శ్రీగిరి బాల విహార్ శిక్షణా తరగతులు

చిన్మయ మిషన్ తోడ్పాటుతో ప్రతి ఆదివారం ఉదయం 9.30 గంటలకు శ్రీ గిరి గో క్షేత్రంలో జరిగే శ్రీగిరి బాల విహార్ ఆధ్యాత్మిక ధ్యాన వ్యక్తిత్వ వికాస ఉచిత శిక్షణా తరగతులలో బాల బాలికలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని శ్రీగిరి దేవస్థానం నిర్వాహకులు కోరారు.



# రాష్ట్ర అసెంబ్లీ సందర్శనకు పిఎంశ్రీ జడ్పీహెచ్ఎస్ కరేడు విద్యార్థులు

(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, ఫిబ్రవరి 27)

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ వారి ఉత్తర్వుల ప్రకారం పాఠశాలలో చదివే విద్యార్థులకు అసెంబ్లీ సెషన్స్ జరిగే సందర్భంలో విద్యార్థులు సందర్శించి పలు విషయాలు నేర్చుకునేలా ఏర్పాటు చేశారు. ఆ క్రమంలో పిఎం శ్రీ జడ్పీహెచ్ఎస్ కరేడు విద్యార్థులు శుక్రవారం అసెంబ్లీని సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులు అమూల్యమైన సమాచారాన్ని గ్రహించి తోటి విద్యార్థులతో చర్చల ద్వారా పంచుకున్నారు. సదరు కార్యక్రమాలు ఏర్పాటుచేసిన రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబునాయుడుకి ,విద్యాశాఖ మంత్రి నారా లోకేష్, కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావుకి పాఠశాల విద్యార్థిని, విద్యార్థులు, సభ్యులు, తల్లిదండ్రులు, అలాగే గ్రామ పెద్దలు ధన్యవాదాలు తెలియజేశారు.

**పిల్లలకు అర్థమయ్యేలా అసెంబ్లీ కార్యక్రమాలను వివరించిన ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు**

అసెంబ్లీ కార్యక్రమాలను ప్రత్యక్షంగా చూసే అవకాశం శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు ఆహ్వానంతో ఉలవపాడు మండలం కరేడు హైస్కూల్ లో 9వ తరగతి చదువుతున్న 28 మంది విద్యార్థులు, శుక్రవారం అసెంబ్లీ ప్రాంగణానికి వెళ్లారు. ప్రేక్షకుల గ్యాలరీలో కూర్చొని, వ్యవసాయ రంగంపై జరుగుతున్న చర్చను సుమారు అరగంట సేపు ప్రత్యక్షంగా తిలకించారు. స్పీకర్ సభను నడిపిస్తున్న విధానం, మంత్రి అచ్చెన్నాయుడు ప్రసంగం, సభ్యుల స్పందన, అక్కడి నియమాలను గమనించారు. అనంతరం విద్యార్థులంతా, అక్కడే ఉన్న కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ని కలిశారు. ఈ సందర్భంగా అసెంబ్లీలో ఎమ్మెల్యేలు ప్రస్తావించే అంశాలు, సభ నిర్వహణ, ఇతర అంశాల గురించి ఎమ్మెల్యే నాగేశ్వరరావు విద్యార్థులకు అర్థమయ్యేలా వివరించారు. ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు తో పాటు ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ ,చీరాల ఎమ్మెల్యే ఎంఎం కొండయ్యతో కలిసి విద్యార్థులు గ్రూప్ ఫోటో దిగుతూ సందడి చేశారు. కరేడు హైస్కూల్ పీడీ పి శ్రీనివాసులు, సోషల్ టీచర్ పి సుబ్బారావులు విద్యార్థులతో కలిసి ఈ పర్యటనలో పాల్గొన్నారు. సదరు కార్యక్రమం విజయవంతం కావడంలో సహకరించిన మండల విద్యాశాఖ అధికారులు 1,2లకు పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ, ఉపాధ్యాయ సిబ్బంది, ఎస్ఎంసి సభ్యులు ప్రత్యేకమైన ధన్యవాదాలు తెలియజేశారు.

## పీడీఓ శ్రీనివాసరావు సస్పెండ్

**చాపలమడుగులో రూ.12.75 లక్షల నిధుల దుర్వినియోగం ఆరోపణలు**

**ఆరోపణలు రుజువు కావడంతో సస్పెండ్ చేసిన కలెక్టర్**

**(షణ్ముఖ వెలుగు, పుల్లలచెరువు, ఫిబ్రవరి 27)**

మార్కాపురం జిల్లాలోని పుల్లలచెరువు మండల పరిధిలోని చాపలమడుగు గ్రామ పంచాయతీలో ఆర్థిక అక్రమాలు వెలుగుచూశాయి. గ్రామ పంచాయతీ డెవలప్మెంట్ ఆఫీసర్ (గ్రేడ్4) వి శ్రీనివాసరావు గ్రామపంచాయతీ నిధుల నుంచి రూ.12,75,012లను దుర్వినియోగం చేసినట్లు అధికారికంగా వెల్లడైంది. జిల్లా కలెక్టర్ కార్యాలయం నుంచి 25-02-2026న జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం ఈ మొత్తం 15వ ఆర్థిక సంఘం నిధుల నుంచి డ్రా చేసినట్లు పేర్కొన్నారు. డిప్యూటీ మండల పరిషత్ డెవలప్మెంట్ ఆఫీసర్, మండల పరిషత్ డెవలప్మెంట్ ఆఫీసర్, పుల్లలచెరువు సమర్పించిన నివేదికలను పరిశీలించిన అనంతరం జిల్లా కలెక్టర్ పి రాజాబాబు చర్యలు తీసుకున్నారు. సీసీఏ నియమావళి 3(సి), 8(1) ప్రకారం వి శ్రీనివాసరావును తక్షణమే సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. క్రమశిక్షణాత్మక విచారణ పూర్తయ్యే వరకు సస్పెన్షన్ అమల్లో ఉంటుందని స్పష్టం చేశారు. సస్పెన్షన్ కాలంలో సంబంధిత అధికారి హెడ్క్వార్టర్స్‌ను అనుమతి లేకుండా విడిచి వెళ్లరాదని కూడా ఆదేశించారు. పుల్లలచెరువు ఎంపిడిఓ అవసరమైన తదుపరి చర్యలు తీసుకుని జిల్లా కార్యాలయానికి నివేదించాలని ఆ ఉత్తర్వుల్లో సూచించారు. ఈ ఘటన స్థానికంగా చర్చనీయాంశమైంది. గ్రామ పంచాయతీ నిధుల వినియోగం పై మరింత లోతైన విచారణ జరపనున్నట్లు అధికారులు వెల్లడించారు.

# జిల్లాలో ప్రారంభమైన జనసేన పార్టీ ఉద్యమి సభ్యత్వ నమోదు

**ప్రారంభించిన మాజీ మంత్రి బాలినేని**

**గతం కంటే ఎక్కువ సభ్యత్వాలు నమోదు కావాలని కార్యకర్తలకు పిలుపు**

**అధినేత ఆశయాలకు అనుగుణంగా పని చేయాలి**





**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఫిబ్రవరి 27)**

రాష్ట్రవ్యాప్తంగా జనసేన పార్టీ ఉద్యమి సభ్యత్వ నమోదు కార్యక్రమం పండుగ వాతావరణంలో జరుగుతుందని ఆ పార్టీ రాష్ట్ర నాయకులు మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి అన్నారు. ఒంగోలు విచ్చేసిన బాలినేని లాయర్ పేటలోని ఆయన నివాసంలో జిల్లాలోని జనసేన పార్టీ నాయకులు కార్యకర్తలతో సమావేశం ఏర్పాటు చేసి సభ్యత్వ నమోదుపై దిశానిర్దేశం చేశారు. పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు ప్రకాశం జిల్లా వ్యాప్తంగా ఆరోవ విడత సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టడం జరిగిందని అన్నారు. కార్యకర్తలే పార్టీకి బలం అని తెలిపిన ఆయన గత ఏడాది కంటే ఈ ఏడాది రెట్టింపు సభ్యత్వాలు నమోదు చేసేలా కార్యకర్తలు పని చేయాలని పిలుపునిచ్చారు. అత్యధిక సభ్యత్వాలు నమోదు చేసిన వారికి తగిన గుర్తింపు కోసం పోరాడతానని బాలినేని అన్నారు. పార్టీ అభివృద్ధి కోసం జనసైనికులు రెట్టింపు ఉత్సాహంతో పనిచేసే పవన్ కళ్యాణ్ ను ఉన్నత పదవిలో నిలిచేలా చేయాలని పార్టీ శ్రేణులకు సూచించారు. కార్యక్రమంలో జనసేన పార్టీ సెంట్రల్ ఆంధ్ర కన్వీనర్ చీకటి వంశీ దీప్, అధికార ప్రతినిధి రాయపాటి అరుణ, జిల్లా కోఆర్డినేటర్ జడ బాలనాగేంద్ర, పార్టీ నాయకులు గొర్రెపాటి శ్రీనివాసరావు, ఉమ్మడి ప్రకాశం జిల్లాల నియోజకవర్గ పార్టీ సమన్వయకర్తలు, జనసేన పార్టీ కార్పొరేటర్లు పాల్గొన్నారు.

# చేనేత కార్మికులైన పింజల భారతి, భర్త వీర నాగేశ్వరరావు

**కుటుంబ సభ్యులకు రక్షణ కల్పించేందుకు చర్యలు తీసుకోవాలి**

**డిజిపి హరీష్ కుమార్ గుప్తాకు ఫిర్యాదు చేసిన**

**సిపిఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య**



**(షణ్ముఖ వెలుగు, విజయవాడ, ఫిబ్రవరి 27)**

బాపట్ల జిల్లా వేటపాలెం మండలం రామన్నపేట పంచాయితీ బాపనయ్య నగర్ చేనేత కార్మికులైన పింజల భారతి, భర్త వీర నాగేశ్వరరావు, వారి ఇద్దరి పిల్లలు యోగానంద్, వెంకట్ వినయ్ లకు పోలీసు రక్షణ కల్పించాలని, స్థానిక టిడిపి నేతలు, వేటపాలెం ఎస్ఐ పి జనార్దన్‌ల వేధింపుల నుండి కాపాడాలని రాష్ట్ర డిజిపి కి సిపిఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య లేఖ వ్రాశారు. విజయవాడలోని సిపిఐ రాష్ట్ర కార్యాలయం నందు శుక్రవారం నిర్వహించిన మీడియా సమావేశంలో బాధిత చేనేత కుటుంబంతోపాటు ఆయన మాట్లాడారు. బాధితుల ఇంటి ప్రక్కన నివాసం ఉంటున్న దోగుపర్తి హేరంబరరావు, భార్య భువనేశ్వరి ఇంటి కసువు చిమ్మే విషయమై జరిగిన చిన్న వివాదాన్ని స్థానిక నాయకులు సాయంతో వేటపాలెం ఎస్ఐ పి జనార్ధన్ దృష్టికి తీసుకువెళ్లి, పలుమార్లు ఎస్ఐని, పోలీసులను తీసుకొచ్చి బెదిరింపులకు గురిచేయడం జరుగుతోంది. అంతేకాకుండా కేసు నమోదు చేయకుండా ఉండాలంటే రూ.20 వేలు ఇవ్వాలని డిమాండ్ చేయడం, పంచాయతీ గల్లీ విషయంలో దోగుపర్తి హేరంబరావుకు అనుకూలంగా సంతకం పెట్టాలంటూ వేటపాలెం ఎస్ఐ పి జనార్ధన్ వీరిని ఒత్తిడి చేయడంతోపాటు వేటపాలెం పోలీస్ లు బలవంతంగా పింజల భారతి ఇంటి మెట్లు పగలగొట్టించడం వంటి దుశ్చర్యలకు పాల్పడ్డారు. ఫిబ్రవరి 11వ తేదీ రాత్రి సుమారు 7.30 గంటలకు వేటపాలెం ఎస్ఐ పి జనార్ధన్, మరికొంత మంది పోలీస్ లు వచ్చి పింజల భారతిని, పింజల వీర నాగేశ్వరరావును అసభ్యకరంగా దూషిస్తూ చేయి చేసుకుని, పోలీస్ వాహనంలో వేటపాలెం పోలీస్ స్టేషన్ కు తీసుకెళ్లి సివిల్ వివాదం విషయంలో అక్రమంగా తెల్ల కాగితాలపై సంతకాలు తీసుకున్నారు. దోగుపర్తి హేరంబరరావు, అతని భార్య భువనేశ్వరి, దోగుపర్తి భీమయ్య, దోగుపర్తి లీలా, దోగుపర్తి రాజేష్, గడ్డం ప్రసాద్, వుమ్మిటి శంకరరావు, కల్లూరి నాగరాజు, గొల్లప్రోలు కృష్ణ, నాసిక వీరభద్రయ్య, సిద్ది బుచ్చేశ్వరరావులు పోలీస్ ల సహకారంతో వేధింపులకు గురిచేస్తూ, చంపుతామని; పోలీసులు అక్రమ కేసులు బనాయించి జైలుకు పంపుతామని బెదిరిస్తున్నారని, ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపి పింజల భారతి, వీర నాగేశ్వరరావులను వేధింపులకు గురిచేస్తున్న ఎస్ఐ, పోలీసులతో సహా, స్థానిక అధికార పార్టీ నాయకులపై చట్టపరమైన చర్యలు చేపట్టి, పింజల భారతి కుటుంబానికి రక్షణ కల్పించి, న్యాయం చేసేందుకు తగు చర్యలు చేపట్టవలసిందిగా రాష్ట్ర డిజిపిని ఆయన కోరారు. ఈ సమావేశంలో బాధితులు పింజల భారతి, వీర నాగేశ్వరరావు, బాపట్ల జిల్లా సిపిఐ కార్యదర్శి తన్నీరు సింగరకొండ పాల్గొన్నారు.

# వర్గీకరణ చేశారు... ఉద్యోగాలు ఏవి ?

**జాబ్ క్యాలండర్‌తో పాటు ఎస్సీ, ఎస్టీ బ్యాక్ లాగ్ పోస్టులు భర్తీ చేయాలి**

**దళిత నేత నీలం నాగేంద్ర రావు డిమాండ్**



**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఫిబ్రవరి 27)**

ఎస్సీ వర్గీకరణ చేసి సామాజిక న్యాయం అంటున్న ముఖ్యమంత్రి రెండేళ్లు అయినా ఎస్సీ, ఎస్టీ బ్యాక్‌లాగ్ పోస్టుల నోటిఫికేషన్ కూడా ఇవ్వకపోవటం కూటమి ప్రభుత్వ మనువాదానికి నిదర్శనం అని దళిత హక్కుల పరిరక్షణ సమితి అధ్యక్షుడు నీలం నాగేంద్ర రావు ధ్వజమెత్తారు. శుక్రవారం సమితి కార్యాలయంలో జరిగిన సమావేశంలో నీలం నాగేంద్రరావు మాట్లాడుతు ప్రతి ఏటా నిరుద్యోగుల కొరకు జాబ్ క్యాలండర్ ప్రకటిస్తునం అన్న కూటమి ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ బ్యాక్ లాగ్ పోస్టుల నోటిఫికేషన్ మాత్రం మర్చిపోయిందన్నారు . గతంలో జిల్లా స్థాయిలో కలెక్టరేట్ ద్వారా బ్యాక్ లాగ్ పోస్టులు భర్తీ చేసేవారన్నారు. తరువాత సోషల్ వెల్ఫేయిర్ డిపార్ట్మెంట్ ద్వారా జిల్లాలోని అన్ని శాఖల నుండి ఉద్యోగుల ఖాళీల వివరాలు తెపించుకొని బ్యాక్ లాగ్ పోస్టుల నోటిఫికేషన్ ఇచ్చేవారన్నారు. అదే విధంగా రాష్ట్ర , కేంద్ర ప్రభుత్వాలు కూడా ఎస్సీ, ఎస్టీ బ్యాక్ లాగ్ పోస్టుల నోటిఫికేషన్ ఇచ్చేవారన్నారు. ఎస్సీ, ఎస్టీ బ్యాక్ లాగ్ పోస్టుల భర్తీ విధానం పై ఎస్సీ, ఎస్టీ శాసనసభ కమిటీలు జిల్లాలు వారీగా పర్యటించి జిల్లా అధికారుల ద్వారా రికార్డులు పరిశీలించేవారన్నారు. కాలక్రమేనా అగ్రకుల మనువాద ప్రభుత్వాలు ఎస్సీ, ఎస్టీ లకు ఉద్యోగాలు లేకుండా చెయ్యటానికి ఔట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ బేసిస్, ఇతర ఏజన్సీస్ ద్వారా ఉద్యోగాలు భర్తీ చేసుకుంటున్నారన్నారు. అటెండరు , వాచ్ మెన్ లే గాకా సోషల్ వెల్ఫేయిర్ హాస్టల్స్‌లో కూడా వంటమనుషులను కూడా రిజర్వేషన్ పాటించకుండా తమకు ఇష్టమైన వారిని, అధికార పార్టీ ఎమ్మెల్యేలు చెప్పిన వారిని నియమించుకుంటున్నారన్నారు. పెరిగిన జనాభా శాతాన్నికి అనుగుణంగా ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్ శాతం పెంచకుండా 30 ఏళ్ల నాటి ఎస్సీలకు 15%, ఎస్టీ లకు 7% రిజర్వేషన్స్ నే అమలు చెయ్యటం లేదన్నారు. జిఓ ఆర్‌టి నెం. 181 ప్రకారం 2021 జులై 2వ తేదీన బ్యాక్ లాగ్ పోస్టుల భర్తీ నోటిఫికేషన్ సోషల్ వెల్ఫేయిర్ డిపార్ట్మెంట్ ఇచ్చిందే కానీ ఏమైందో తెలీదు అన్నారు. పోలీస్ శాఖలో తప్పా ఇతర ప్రభుత్వ శాఖల్లో ఉస్యోగుల కొరత తీవ్రంగా ఉన్నా , బాపట్ల జిల్లా కలక్టరేట్‌లో కలెక్టర్ పర్సనల్ సెక్రటరీ, పిఎలు కూడా రెవెన్యూ వారు లేరన్నారు. తాంబూలాలు ఇచ్చాము, తన్నుకు చావండి అన్నట్టు మాల, మాదిగలని చీల్చి వర్గీకరణకు సామాజిక న్యాయం చేశామని చంద్రబాబు మాట్లాడుతున్నారన్నారు. పెరిగిన జనాభా అనుగుణంగా రిజర్వేషన్ శాతాన్ని పెంచి బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు.


On behalf of PRINTER, PUBLISHER OWNED BY OBULASETTY RADHAKRISHNA DASS AND PRINTED AT HARI PRINTERS AND PUBLICATIONS, FLOT 51, NEAR B.V.SUBBAIAH SCHOOL ROAD, PERNAMITTA, SANTANUTALAPADU (MANDAL), PRAKASAM/ONGOLE (Dt), ANDHRA PRADESH, PIN : 523225. Mobile : 9494177939, RNI : APTEL/2023/89152, e-mail : rkreport9@gmail.com. E-Paper : shanmukhavelugu.com